# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 215 | హైదరాబాద్ | మంగళవారం 17-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఏం మారినా టీమిండియా గెలుపు మాత్రం స్థిరం: అమిత్ షా

ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం..

## 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

- రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండలను దక్కించుకున్న కాంగ్రెస్
- కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ విజయం
- జనగాం, తొర్రూర్, క్యాతనపల్లి, జహీరాబాద్ మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

11లో




మళ్లీ మొరాయించిన

## ఎక్స్...

ప్రపంచవ్యాప్తంగా యూజర్ల అవస్థలు


11లో

- భారత్ సహా పలు దేశాల్లో ఎక్స్ సేవలకు అంతరాయం
- లాగిన్ సమస్యలు, పోస్టులు లోడ్ కాకపోవడంతో ఇబ్బందులు



11లో

రైతులకు తెలంగాణ ప్రభుత్వం

## శుభవార్త

- వరి బోనస్ బకాయిలను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులు విడుదల
- ఇప్పటి వరకు రూ.1,939.58 కోట్ల బోనస్ నిధులు చెల్లింపు

విశాఖలో అట్టహాసంగా

## అంతర్జాతీయ నౌకాదళ ఉత్సవాలు


11లో

- విశాఖలో ఘనంగా ప్రారంభమైన IFR2026
- 50 దేశాలు, 70 యుద్ధనౌకలతో మెగా వేడుకలు
- పది రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

ఢిల్లీలో ఏవియేషన్ సంస్థను

## ప్రారంభించిన మంత్రి లోకేశ్

- ఢిల్లీలో చార్లీ ఫాక్స్‌ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్‌ను ప్రారంభించిన నారా లోకేశ్
- తన అట్లాంటా పర్యటనలో ఈ సంస్థ ఏర్పాటు ఆలోచన వచ్చినట్లు వెల్లడి
- దేశ విమానయాన రంగానికి నైపుణ్యవంతులను అందించడమే లక్ష్యం
- యువ పైలట్ క్యాడెట్లతో ముచ్చటించిన మంత్రి లోకేశ్


11లో


11లో

జేఈఈ మెయిన్స్

## ఫలితాలు విడుదల..

- దేశవ్యాప్తంగా 12 మందికి 100 పర్సంటైల్ స్కోర్
- టాపర్లలో ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒకరు
- మహిళా టాపర్‌గా 99.99 పర్సంటైల్‌తో హర్యానా అమ్మాయి
- ఏప్రిల్‌లో రెండో సెషన్ పరీక్షకు అవకాశం

ఢిల్లీలో ప్రారంభమైన

## 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'

- ఢిల్లీలో ప్రారంభమైన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026
- 80 దేశాల ప్రతినిధులు, 500 మందికి పైగా ఏఐ నిపుణుల హాజరు
- ఫిబ్రవరి 19న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ప్రసంగం
- గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం
- ఏఐ ఛాలెంజ్‌ల ఫైనలిస్టులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు



11లో

ఉండవల్లిలో అరటితోటను

## సందర్శించిన బిల్ గేట్స్..

- సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ క్షేత్రస్థాయిలో పర్యటన
- వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పరిశీలన
- టెక్నాలజీ వాడుతున్న రైతులను అభినందించిన సీఎం
- ఏఐతో రైతులకు సలహాలు అందిస్తున్నామని వెల్లడి


11లో

భారతశక్తి®

# స్వశక్తితో శత్రుదేశాలకు చెక్

ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వశక్తి పెంచుకోవడంపై భారత్ దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సైన్యానికి అవసరమైన అత్యాధునిక ఆయుధాలను తయారు చేస్తోంది. ఇటీవల కేంద్రం బడ్జెట్‌ను కూడా లక్ష కోట్లు అదనంగా కేటాయించింది. మరోవైపు అత్యవసర పరిస్థితిలో విమానాలు ఎక్కడైనా దిగేందుకు వీలుగా జాతీయ రహదారులను నిర్మిస్తోంది. నరేంద్రమోదీ స్టైలే వేరు.. ఎవడికి ఎక్కడ చెక్ పెట్టాలో.. ఎవరిని ఎలా అణచివేయాలో ఆయనకు తెలిసినంత ఎవరికీ తెలియదు. దేశం కోసం ఆయన ఏమైనా చేస్తారు. దేశం ఫస్ట్ నినాదాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తారు. తనను ద్వేషించినా, ధూషించినా పట్టించుకోరు. సంపాదించాలనే యావ లేని వ్యక్తి. గతంలో చైనాకు లొంగిపోయాడని కాంగ్రెస్ మోదీపై ఆరోపణలు చేసింది. ఇక అంబానీ అదానీకి దోచి పెడుతున్నాడని ఆరోపిస్తోంది. గతంలో రఫేల్ కొనుగోలుపైనా రాద్ధాంతం చేసింది కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అంటే 2014కు ముందు ఈశాన్యరాష్ట్రం ఉగ్రవాదం, వేర్పాటువాదం, సదుపాయాల లేమి. అభివృద్ధి రాహిత్యం వంటి సమస్యలు ఉండేవి. ఇక వేర్పాటు వాదం బలంగా ఉండేది. బోడోలాండ్, మణిపూర్‌లో ఉగ్రవాద సంస్థలు పనిచేయడం జరిగేది. మోదీ వచ్చాక ఆయన దేశ సరిహద్దును ఒక వంతెనగా మార్చారు. ఆగ్నేయాసియా దేశాలకు రాకపోకలు సాగించడానికి, సంబంధాలు మెరుగుపరచడం, ఇచ్చిపుచ్చుకోవడానికి ఈశాన్య భారత్‌ను బ్రిడ్జిగా చూశారు. ఇదే సమయంలో ఈశాన్య రాష్ట్రాల్ల అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లు, రైలు మార్గాలు నిర్మించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న వేర్పాటు వాదం తొలిపోయేలా చేశారు. ఇక మన దేశంలో మనపైనే బాంబులు కురిపించిన ప్రాంతం..సియాచెన్? కశ్మీర్‌కు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న ద్వీపం. గతంలో దీనిపై చైనా ఆధిపత్యం చెలాయించింది. బెదిరిస్తూ.. వాడుకుంది. మొజాంబిక్ ఛానల్‌కు కీలకమైన సియాచెల్స్‌లో ఇప్పుడు మోదీ చక్రం తిప్పబోతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సియాచెన్‌కు 175 మిలియన్ డాలర్ల ఆర్థికసాయం ప్రకటించారు. అక్కడ నావీ బేస్ ఏర్పాటు చేయబోతున్నారు.భారత్ ఆర్థికసాయంతో గృహ నిర్మాణం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఉన్నాయి. మొజాంబిక్ ఛానెల్ వైపు చైనా షిప్పింగ్ రాకపోకలను గమనించేలా భారత నేవీ బేస్ ఏర్పాటు అవుతుంది. గతంలో చైనా బెదిరింపులు విఫలమైన నేపథ్యంలో ఈ అడుగు వ్యూహాత్మకం.చైనా భారత చుట్టూ నౌకల మోహార్ వేస్తుంటే, సియాచెన్ బేస్ దాని ఆధిపత్యాన్ని ఎదుర్కొంటుంది. ఇది హిందూ మహాసముద్రంలో భారత పత్రిక స్థిరపడుతుందన్న సంకేతం. మోదీ దీర్ఘకాలిక దృష్టితో ఆర్థిక సహాయం ద్వారా మిత్రత్వాలు పెంచుకుంటూ, రక్షణ ప్రాంగణాన్ని బలోపేతం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇండో?పసిఫిక్ ప్రాంతంలో భారత ఆధిపత్యం పెరుగుతుందిమూడేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన రహదారులపై విమానాల ల్యాండింగ్ విజయవంతంగా నిర్వహించింది. తాజాగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అస్సాం మొరాన్‌లో ఎన్‌హెచ్ ?127పై యుద్ధ విమానాల ల్యాండింగ్ ట్రయల్స్ విజయవంతం చేసింది. ఈశాన్య భారతదేశంలో మొదటి ఈఎల్ఎఫ్‌గా, సుఖోయ్, రాఫెల్ వంటి యుద్ధ విమానాలు ఇక్కడ నిలిచే సామర్థ్యం ప్రదర్శించాయి. ఇది దేశ రక్షణ వ్యవస్థకు కీలకం.యుద్ధ సమయంలో ఎయిర్‌స్ట్రిప్‌లు దెబ్బతిన్నప్పుడు హైవేలను రన్‌వేలుగా దిగడానికి వీలుగా నిర్మించారు. అస్సాం 4.2 కి.మీ. భాగం 4?లేన్ రూపంలో నిర్మించారు. ప్రభుత్వ భవనాలు, సైనిక కార్యకలాపాలకు ఉపయోగపడుతుంది. ప్రధాని మోదీ నేరుగా హైవేపై ల్యాండ్ చేసి ప్రారంభించనున్నారు.ఈశాన్య రాజకీయ, వ్యూహాత్మక కేంద్రం. చైనా, మయన్మార్ సరిహద్దుల సమీపంలో ఈ ఈఎల్ఎఫ్ యుద్ధ సామర్థ్యాన్ని పెంచుతుంది. విపత్తు సమయంలో రిలీఫ్ పనులకు కూడా ఉపయోగపడుతుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధునికీకరణలో ఇదో మైలురాయి.భారతదేశంలో 10కిపైగా ఈఎల్ఎఫ్‌లు రానున్నాయి. ఈశాన్యలో మొదటిది మొరాన్. స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసి ఆత్మనిర్భర్ భారత్‌కు దోహదపడుతుంది. చైనా ప్రపంచ బౌద్ధులను తన వలయంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తోంది. మోదీ దీనికి సమర్థవంతమైన సమాధానం ఇచ్చారు. ఈశాన్యాన్ని గ్లోబల్ బౌద్ధ టూరిజం కేంద్రంగా మార్చి, థాయ్‌లాండ్, వియత్నాం వంటి దేశాలతో భాగస్వామ్యం పెంచారు. రహదారుల అభివృద్ధి, పర్యాటక ఆహ్వానం ద్వారా ఆర్థిక ఉత్తేజనం, భద్రతా స్థిరత్వం సాధించారు.మోదీ చదరంగం ఈశాన్యాన్ని సమస్యా ప్రాంతం నుంచి అవకాశ కేంద్రంగా మార్చింది. టూరిజం ఆదాయం, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ సంబంధాలు బలపడటం ద్వారా దేశ ఐక్యత బలపడింది. ఇది కేవలం ప్రాంతీయ మార్పు కాదు గ్లోబల్ డిప్లొమసీలో భారత్ ఆధిక్యానికి ముఖ్య రక్షణ.రఫేల్, సుఖోయ్ వంటి భారీ విమానాలకు సరిపోతుంది. ఈ నిర్మాణంతో పొరుగున ఉన్న చైనా, బంగ్లాదేశ్‌తో యుద్ధం వస్తే ఇక్కడి నుంచే యుద్ధ విమానాలను పంపే అవకాశం కూడా ఉంటుంది. దీంతో శత్రుదేశాల్లో వణుకు మొదలైంది.

# పోటీ చేయాలంటున్న కేడర్...

నెల్లూరు, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్ మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందిప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా

# ఎమ్మెల్యేలకు సీఎం స్వీట్ వార్నింగ్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:



సెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ లో పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు చంద్రబాబు. పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. మారకపోతే మీకే నష్టం అని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్ లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నా అని చెప్పారు. 95-96 మాదిరిగానే ఈసారి నిక్కచ్చిగా ఉంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. మొత్తం 9 పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నా అని తెలిపారు. వారికి తెలియని ఇంకొన్ని పేరా మీటర్లు కూడా తన దగ్గర ఉన్నాయన్నారుసిఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. వైసీపీ విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని, ఇబ్బందులు అధిగమించిన ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో సమస్యలు అయితే మాత్రం ఇంకా చాలా ఉన్నాయి.. ఆదాయం తక్కువ ? ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్రం సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాం.. వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలని ఆకాంక్షించారు. సేవా రంగంలోనూ ఆదాయం మరింత పెరగాలి.. ఒంగోలు పాలకు, అనంతపురం పండుకు ఎంతో డిమాండ్ ఉందని తెలిపారు. ఈ రెండింటి రుచి మరెక్కడా రాదు.. రెండు మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. అప్పటికి పూర్తిగా గాడిలో పడతాం.. రెండు మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని పేర్కొన్నారు. అమరావతి రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ వల్ల యాక్సిస్ మరింత పెరుగుతుందన్నారు సిఎం.రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే.. హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు కేటాయించడం బాగుందని తెలిపారు. రాయలసీమలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికేది కాదన్న ఆయన.. పశుగ్రాసం, నీళ్లను రైళ్లలో తరలించిన సందర్భాలు ఉన్నాయన్నారు. 2014 ? 19 మధ్య కూడా రైన్ గన్స్ తో పంటలు కాపాడే పరిస్థితి ఉండేది..అప్పుడే హంద్రీనీవాను సీరియస్గా తీసుకున్నామని, దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయి.. రాయలసీమలో పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు.ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్లో ఇచ్చే నివేదిక వారి పని తీరుకు నిలువుటద్దమని తెలిపారు. నేను గతంలో ఉన్నట్లే నిక్కచ్చిగానే ఉంటా.. మారకపోతే వాళ్లకే నష్టమని హెచ్చరించారు. మొత్తం తొమ్మిది పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నానని.. వారికి తెలియని ఇంకొన్ని పేరా మీటర్లు కూడా నావద్ద ఉన్నాయన్నారు. లోకేష్ తన పని తాను చేస్తున్నాడు.. నా పని నేను చేస్తున్నా అని.. నేతలతో మానవీయ సంబంధం, మోటివేషన్ భయం ? భక్తిలా ఉండాలంటూ చెప్పుకొచ్చారు.

# వల్లభనేని వంశీకి షాక్

విజయవాడ,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రాజకీయ భవిష్యత్తు విషయంలో ఇప్పుడు ఆసక్తి నెలకొంది. 2019లో పార్టీ మారిన ఆయన.. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ విషయంలో అనుసరించిన వైఖరి ఇప్పుడు ఆయనకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది అనే మాట వాస్తవం. ఇక ప్రస్తుతం వైసీపీలో ఉన్న వల్లభనేని వంశీ మోహన్.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానికి సంబంధించి స్పష్టత రావటం లేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిన వంశీ, మళ్లీ వెనక్కు తగ్గినట్లుగానే కనబడుతోంది.అయితే గ్రామాల్లో ఆయనకు కొంత ఫాలోయింగ్ ఉండటంతో, వంశీ ప్రజల్లోకి వెళ్లాలని ఆ పార్టీ



అధిష్టానం కూడా కోరుతున్నప్పటికీ వంశీ దూకుడు ప్రదర్శించడం లేదు. కేసులు భయం కారణంగా వంశీ వెనక్కు తగ్గుతున్నట్లుగా స్పష్టంగా అర్థం అవుతుంది. వచ్చే ఎన్నికల నాటికి గన్నవరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలి అంటే.. కచ్చితంగా వంశీ ప్రజల్లోకి రావాలని, ఆ పార్టీ కార్యకర్తలు కూడా కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం కూడా వంశీ పై ఉంది.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే పై వచ్చే ఆరోపణల విషయంలో, కూడా వంశీ కాస్త దూకుడు ప్రదర్శించాలని ఆ పార్టీ నాయకత్వం కోరుతోంది. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వంశీ బయటకు రావడానికి ఇష్టపడటం లేదు. దీనితో గన్నవరం నియోజకవర్గంలో, ఇన్చార్జిను మార్చాలనే ఆలోచనలో కూడా పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయిలో కసరత్తు కూడా చేశారని, అయితే ఒకరిద్దరి నేతలు అధినేత వైఎస్ జగన్ వద్ద నియోజకవర్గ పరిస్థితిని ప్రస్తావించడంతోనే వెనక్కు తగ్గినట్లుగా తెలుస్తోంది.వంశీ అరెస్టు విషయంలో గ్రామాల్లో కొంత సానుభూతి ఉంది అనే ప్రచారం కూడా ఉంది. దీనిని వంశీ వాడుకునే ప్రయత్నం కొంత చేసినప్పటికీ ఆ తర్వాత పరిస్థితులు సహకరించకపోవడంతో మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఇక నియోజకవర్గంలో నాయకత్వాన్ని మారిస్తే, భవిష్యత్తులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధిష్టానానికి ఇప్పటికే కొంతమంది చెప్పినట్లుగా వైసిపి వర్గాలు అంటున్నాయి. అందుకే వంశీ విషయంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉందని సమాచారం.

# సైలెంట్ మోడ్ లోకి కొట్టు సత్యనారాయణ

ఏలూరు, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్



అడ్వయిజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చే జరుగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట.ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్ళాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో..ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే..తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమంటూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు.కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తారో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టీవ్ అవుతారా? లేక తనదారి తన చూసుకుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలమాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# 10 ఏళ్లలో మూడింతలైన యూపీ బడ్జెట్

లక్నో, ఫిబ్రవరి 16, యోగి ఆదిత్యనాథ్.. పరిచయం అక్కరలేని పేరు. కరుడుగట్టిన హిందుత్వవాది. కుహానా లౌకికవాదులకు మొగుడు. దేశభక్తులు, మహిళా పక్షపాతి. కామాధులపైకి బుల్డోజర్లు నడిపిన ముఖ్యమంత్రి. సంచల నిర్ణయాలతో ఉత్తరప్రదేశ్‌లో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది యోగి ప్రభుత్వం. ఈ క్రమంలో మరో రికార్డు సృష్టించింది. రాష్ట్ర చరిత్రలో అరుదైన రికార్డు నెలకొన్పింది.యూపీలో యోగి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాదితో పదేళ్లు పూర్తి చేసుకుంటుంది. అయితే ఆర్థిక మంత్రులు మారినా.. యోగి ప్రభుత్వంమే 2017?18 నుంచి 2026?27 వరకు వరుసగా 10 ఆర్థిక బడ్జెట్లు ప్రవేశపెట్టడం ద్వారా ఏకైక రికార్డు సృష్టించింది.చివరి బీజేపీ యేతర బడ్జెట్ రూ.3.4 లక్షల కోట్లు. అప్పటి ఆర్థిక మంత్రి అఖిలేష్ యాదవ్ ప్రవేశపెట్టారు. ఇక ప్రస్తుతం యోగి పాలనలో 2026?27కి రూ.9.13 లక్షల కోట్లు సుమారు మూడు రెట్లు పెరిగింది. ఆర్థిక స్థిరత్వం, పెట్టుబడుల ద్వారా ఈ ఎదుగుదల సాధ్యమైంది.ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రామీణ ఉపాధి, రవాణా, ఆసుపత్రులు, రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు. రోడ్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, పారిశ్రామిక ప్రాంతాలు, ఆరోగ్య సౌకర్యాలు మెరుగుపడ్డాయి.

# ఎన్నికలలకు రెడీ అవుతున్న ఈసీ

విజయవాడ,, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:న స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటినుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పోరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

# సెక్స్ కోసం ప్రత్యేక దీవి ఎఫ్ స్టీన్ మాములోడు కాదు

న్యూయార్క్,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

కొద్దిరోజులుగా అంతర్జాతీయ మీడియాలో ఎఫ్ స్టీన్ గురించి విపరీతమైన చర్చ నడుస్తోంది.. అతడికి సంబంధించిన ఏవో ఫైల్స్ తెర పైకి వచ్చాయని.. వారంతా కూడా సమాజంలో పేరుపొందిన వ్యక్తులని.. వ్యక్తిగత భోగాల కోసం.. పద్ధతిలేని సుఖాల కోసం వారంతా అక్కడికి వచ్చేవారని.. ఎఫ్ స్టీన్ వారికోసం ఆ దీవిని అలా ఏర్పాటు చేశాడని ఇప్పుడు సరికొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.అమెరికా దేశస్థుల వ్యవహారాలు ప్రపంచానికి కొత్త కాదు. అప్పట్లో బిల్ గేట్స్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మోనిక లెవెన్స్ తో సాగించిన వ్యవహారం ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఆ తర్వాత అమెరికాలోని పేరుపొందిన వ్యక్తుల వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం మొదలైంది. ఇప్పుడు ఈ ఫైల్స్ ద్వారా అమెరికాలో పేరుపొందిన వ్యక్తుల చీకటి వ్యవహారాలు మరింతగా తెలుస్తున్నాయి.ఎఫ్ స్టీన్ భూవిమ్మాద లేకపోయినప్పటికీ.. అతడు సాగించిన వ్యవహారాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఎఫ్ స్టీన్ అనేవాడు ఒక బ్రోకర్. వాడి లక్ష్యం ప్రపంచంలో ఉన్న ఆగర్భ శ్రీమంతులకు స్వర్గసుఖాలను అందించడం.. దానిని అతడు వృత్తిగా మార్చుకున్నాడు. ఎఫ్ స్టీన్ కు సెయింట్ జేమ్స్ అనే ఒక సొంత దీవి ఉండేది. దీనికి ఎపి స్టయిన్, పీడో ఫైల్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పీడో ఫైల్ అంటే.. కౌమార బాలికల పై ఉండే ఆకర్షణ కలిగి ఉండే ఒక రకమైన సైకో లక్షణం. ఎఫ్ స్టీన్ బ్రోకర్ పని చేసి భారీగా కూడపెట్టాడు. ఇతడికి బోయింగ్ 727 అనే సొంత విమానం ఉండేది. దీనికి అతడు లోలిటా ఎక్స్ ప్రెస్ అనే పేరు కూడా ఉండేది. లోలిటా అంటే కామంత కళ్ళు మూసుకుపోయిన ఒక మృగాడి వాంఛలు తీర్చే కౌమార బాలిక అని అర్థం.ఎఫ్ స్టీన్ కు రాజకీయ నాయకులతో సంబంధాలు ఉండేవి. ప్రపంచ కుబేరులతో సాన్నిహిత్యం ఉండేది. వారికోసం అనేక ప్రాంతాలలో ఉన్న కౌమార బాలికలను ఎఫ్ స్టీన్ అక్కడికి తీసుకొచ్చేవాడు. వారంతా కూడా పేద కుటుంబాలకు చెందిన వారే.లోలిటా విమానంలో ప్రపంచ కుబేరులను అక్కడికి తీసుకెళ్లి.. కౌమార బాలికలతో దారుణమైన పనులు చేసి వచ్చేవారు. ఎఫ్ స్టీన్ కు ఉన్న పరిచయాల ద్వారా అనేకమంది అమ్మాయిలను ఇక్కడికి తీసుకొచ్చేవాడు. తద్వారా దీవిని ఒక భోగం మేళ గా మార్చేశాడు.ఈ బ్రోకర్ పని ద్వారా వచ్చిన డబ్బుతో అతడు అత్యంత విలాసవంతమైన జీవితం గడిపాడు. తర్వాత 2019లో అరెస్టు అయ్యాడు. జైల్లోనే అతడు కన్నుమూశాడు. కొందరేమో ఆత్మహత్య అని.. ఇంకొందరేమో ఈ రహస్యాలు మొత్తం బయటికి వస్తాయని భయంతో పెద్ద వ్యక్తులు అతడిని అంతం చేసి ఉంటారని.. ఇలా రకరకాల ప్రచారాలు వచ్చాయి.ఇక తాజాగా అమెరికా లోని జస్టిస్ విభాగం ఎఫ్ స్టీన్ ఫైల్స్ పేరుతో ఏకంగా 30 లక్షల డాక్యుమెంట్లను, 2000 పైగా వీడియోలను, 1,80,000 పైగా ఫోటోలను బయటపెట్టింది. అందులో బిల్ గేట్స్ కొంతమంది రష్యన్ కౌమార బాలికలతో వ్యవహారాలు సాగించాడని.. అందువల్లే ఆయనకు సుఖ రోగాలు కూడా వచ్చాయని ఆరోపణలు వినిపించాయి. అతడు తీరు నచ్చక మెలిందా విడాకులు కూడా ఇచ్చిందని ప్రచారం కూడా ఉంది.ఎఫ్ స్టీన్ బాగోతం బయటపడిన తర్వాత ప్రసిద్ధ మనుషుల వెనుక ఉన్న నీలి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత వాటికి ఖండనలు కూడా వచ్చాయి. సాధారణంగా మనం ఒకరిని ఆదర్శంగా తీసుకుంటే.. వారి మేధస్సును చూసి పొంగిపోతుంటాం. వారు సంపాదించిన డబ్బు చూసి ఆశ్చర్యపోతుంటాం. కానీ ఆ పెద్ద వ్యక్తుల ముసుగులు తీసి అసలు రూపాలు చూపిస్తుంటే ఆందోళన చెందుతాం. ఎఫ్ స్టీన్ ఫైల్స్ వ్యవహారంలో బిల్ గేట్స్, ఇతర వ్యక్తుల అసలు రూపాలు వెలుగులోకి వచ్చాయి.ఎఫ్ స్టీన్ దీవి గురించి తెలిసిన తర్వాత.. ఇంకా అనేక విషయాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. పేద బాలికలను ఇక్కడికి తీసుకొచ్చేవారు. వారిని లోలిటా విమానంలో తిప్పేవారు. మసాజ్ థెరపీ ద్వారా బాలికలకు మాయమాటలు చెప్పేవారు. ఒక్కసారిగా వారిని ఈ కూపంలోకి లాగేవారు. ఇందులోకి వచ్చిన తర్వాత ఆ అమ్మాయిలకు బయటకు వెళ్లే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు అమెరికా ప్రభుత్వం విడుదల చేస్తున్న ఫైల్స్ కేవలం ఫోటోలు ? వీడియోలు మాత్రమే కాదు.. ఆ బాలికల మౌన రోదన..

# గులాబీకి ముల్లుగా మారిన కవిత...

"ఇది కేవలం టీజర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది"

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:



తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు ఊహించని మలుపులు తిరుగుతోంది. భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం పూర్వవైభవం పోరాడుతున్న తరుణంలో, ఆ పార్టీ ఇంటి పోరే పెద్ద శాపంగా మారేలా కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే దిశగా అడుగులు వేయడం గులాబీ బాటలో ముళ్ల కంచెగా మారుతోంది. పైకి బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో కవిత చీల్చే ప్రతి ఓటు పార్టీ పునాదులను కదిలిస్తుందని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ అస్తిత్వం కోసం అడుగులు వేయడం, గులాబీ దళానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ముఖ్యంగా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, ఆ తర్వాత కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పునాదులను కదిలిస్తున్నాయి.నేరుగా పార్టీ ప్రకటించకపోయినా, మున్సిపల్ ఎన్నికల్లో కవిత తన మద్దతుదారుల ద్వారా 'సింహం' గుర్తుకు మద్దతు ఇచ్చి క్షేత్రస్థాయిలో తన బలాన్ని నిరూపించుకున్నారు. కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులు సాధించిన ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపోటములను శాసించాయి. ఇది కేవలం యాదృచ్ఛికం కాదు, ఒక పక్కా వ్యూహంతో జరిగిన రాజకీయ దాడి అని విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత చీల్చే ప్రతి ఓటూ నేరుగా బీఆర్ఎస్ ఖాతా నుంచే మైనస్ అవుతుండటం ఆ పార్టీ అగ్ర నాయకత్వాన్ని ఆందోళనలో పడేసింది.కవిత తన విమర్శనాస్త్రాలను కేవలం ప్రత్యర్థి పార్టీల వైపు కాకుండా సొంత సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావుల వైపు మళ్లించడం ఇక్కడ ఆసక్తి రేపుతోంది. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను గాలికి వదిలేశారంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ కార్యకర్తల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ పట్ల అపారమైన గౌరవం ప్రకటిస్తూనే, ప్రస్తుత పార్టీ నిర్వహణపై ఆమె నిప్పులు చెరుగుతున్నారు. దీనివల్ల పార్టీలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వం కవిత వైపు చూసే అవకాశం ఏర్పడింది. బీఆర్ఎస్‌లో తలెత్తిన శూన్యతను తన వైపు తిప్పుకోవడంలో ఆమె సఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం కవిత తన రాజకీయ ఎజెండాలో బీసీ సామాజిక వర్గాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వారికిచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె చేస్తున్న ఆరోపణలు పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుపై గట్టి దెబ్బ కొట్టేలా ఉన్నాయి. వచ్చే మూడు నెలల్లో కొత్త పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తానని స్పష్టం చేయడం, అంతర్జాతీయ స్థాయి రాజకీయ వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నారనే వార్తలు బీఆర్ఎస్‌కు ముందరి కాళ్ళ బంధంగా మారాయి.మున్సిపల్ ఫలితాల అనంతరం కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణులకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి. అంటూ ఆమె ఇచ్చిన వార్నింగ్, రాబోయే రోజుల్లో పోరు మరింత ముదురుతుందని సంకేతాలిచ్చింది. తెలంగాణ జాగృతి నెట్‌వర్క్‌ను ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా మార్చడం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ బీఆర్ఎస్ ఓట్లను చీల్చేందుకు ఆమె సిద్ధమవుతున్నారు.తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్నాయి. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోటీ నెలకొన్న తరుణంలో, కవిత నేతృత్వంలోని కొత్త శక్తి 4 నుంచి 5 శాతం ఓట్లు చీల్చినా, అది బీఆర్ఎస్ అభ్యర్థుల పాలిట మరణశాసనమే అవుతుంది. ఒకే సిద్ధాంతం, ఒకే రకమైన ఓటు బ్యాంకు ఉన్నప్పుడు.. చీలిక అనేది ఎప్పుడూ మాతృ పార్టీకే నష్టం చేకూరుస్తుంది.రాజకీయాల్లో సానుభూతి అనేది ఒక శక్తివంతమైన ఆయుధం. కవిత తనపై వస్తున్న విమర్శలను ఎదుర్కుంటూనే, తనకంటూ ఒక స్వతంత్ర అస్తిత్వాన్ని సృష్టించుకుంటున్నారు. ఈ రాజకీయ యుద్ధంలో కవిత అధికారంలోకి వస్తారా లేదా అన్నది పక్కన పెడితే, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, కవిత వేస్తున్న అడుగులను గమనిస్తుంటే, రానున్న రోజుల్లో తెలంగాణలో చతుర్ముఖ పోరు తప్పదనిపిస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంటుంటే, మరోవైపు బీజేపీ తన ఉనికిని చాటుకుంటోంది. ఈ పరిస్థితుల్లో కవిత రూపంలో ఎదురవుతున్న ఈ సొంత ముప్పును బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆమె చేసే విమర్శలు ఆమెకు సానుభూతిని కూడగట్టడమే కాకుండా, తనకంటూ ఒక స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని సృష్టిస్తున్నాయి. ఈ రాజకీయ యుద్ధంలో కవిత గెలుస్తారో లేదో కానీ, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయిసొంత గూటి నుంచే మొదలైన ఈ 'సింహ' గర్జనను గులాబీ దళం ఎలా తట్టుకుంటుందో వేచి చూడాలి.

# తెలంగాణలో కమలం పొత్తుల ప్లాన్ ఏపీ వ్యూహం తప్పదా


హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

దాదాపు గత ఆరేళ్ల నుంచి తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతం అవుతుంది అంటూ ఆ పార్టీ నాయకత్వం చెప్పే ప్రయత్నం చేస్తూనే ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీ సీటు మాత్రమే గెలుచుకుని ఆ మరుసటి ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకుంది ఆ పార్టీ. 2023 ఎన్నికల్లో అసెంబ్లీలో పర్వాలేదు అనిపించిన బిజెపి ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది స్థానాలు గెలుచుకుంది. దీంతో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి ఊహించని దెబ్బ తగిలిందనే చెప్పాలి. ఇక ఆ తర్వాత నుంచి భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపించలేకపోతోంది.గత ఏడాది జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ.. కనీసం ప్రభావం చూపించలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో కూడా పార్టీకి ప్రజలనుంచి మద్దతు కరువైంది. పార్టీ నాయకులు మాటలు చెప్పడమే మినహా బలోపేతం చేయలేకపోతున్నారనేది ఆ పార్టీ కేడర్ ఆవేదన. మున్సిపల్ ఎన్నికల్లో కూడా పార్టీ పెద్దగా ప్రభావం చూపించలేదు. కనీసం తమ ఎంపీలు ఎమ్మెల్యేలు ఉన్నచోట కూడా పార్టీ మున్సిపల్ స్థానాలను కైవసం చేసుకోలేకపోయింది. అయితే ఇప్పుడు.. బిజెపికి రాజకీయ పరిశీలకులు సూచనలు చేస్తున్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే పొత్తు పెట్టుకుని ముందుకు వెళ్లడం మినహా ఆ పార్టీకి మరో మార్గం లేదని.. దీనిపై అధిష్టానం కసరత్తు చేయాలని సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ఫార్ములాను తెలంగాణలో కూడా అమలు చేస్తేనే ఆ పార్టీ సత్తా చాటే అవకాశం ఉంటుందని.. స్థానిక సంస్థల్లో పట్టు లేనప్పుడు ఎంపీ స్థానాలు గెలిచిన పార్టీ బలోపేతం కావడం కష్టం అంటూ హెచ్చరిస్తున్నారు పరిశీలకులు. నాయకులు విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును వీలైనంత త్వరగా తమ వైపుకు తిప్పుకోకపోతే పార్టీ మరింతగా బలహీనపడే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోకుండా బిజెపి ముందుకు వెళ్ళవద్దని.. కాంగ్రెస్ పార్టీని తక్కువ అంచనా వేయడం కరెక్ట్ కాదంటూ అభిప్రాయపడుతున్నారు. జనసేన పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే మంచి ఫలితాలు వచ్చేవని ఆ పార్టీ నాయకత్వానికి పలువురు సూచిస్తున్నారు.

ప్లాన్ బీలో కేటీఆర్...

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ సాధించిన ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన ఫలితాల కోసం పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు.: సుమారు 700-800 వార్డుల్లో విజయం సాధిస్తామని ఆశించామని, ప్రస్తుతం 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించామని కేటీఆర్ తెలిపారు. మరో 37 చోట్ల హంగ్ ఏర్పడిందని, అక్కడ బీఆర్ఎస్ బలంగా ఉందని పేర్కొన్నారు. గద్వాల, వర్ధన్నపేట వంటి చోట్ల అధికారులు రీకౌంటింగ్ పేరుతో కాలయాపన చేశారని, అయినప్పటికీ కార్యకర్తలు వీరోచితంగా పోరాడారని కొనియాడారు.అధికార కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యం, పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు.సింగరేణి ప్రాంతంలో అక్రమాలను అడ్డుకునేందుకు సీపీఐతో కలిసి పనిచేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు ఇస్తామని, ఈ మేరకు కూనంనేని సాంబశివరావుతో మాట్లాడినట్లు వెల్లడించారు.హంగ్ ఏర్పడిన చోట చైర్మన్ పీఠాల కోసం కాంగ్రెస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నాయని, బేరసారాలకు తెరలేపాయని విమర్శించారు.ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, బీఆర్ఎస్ నుంచి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు బలంగా నమ్ముతున్నారని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై ఫిర్యాదు




భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16: ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసాసిన తాండూరు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ముగియక ముందే ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లి ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని పోలీసులకు బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీశైల్ రెడ్డి ఫిర్యాదు చేసారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారని దీంతో జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నేతల మీద అక్రమ కేసులు పెడుతున్నారని, మా మీద ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామని శ్రీశైల్ రెడ్డి అన్నారు.

# తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ

నిజామాబాద్,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

యాసంగి పంట డిజిటల్ సర్వేను పూర్తి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువును చేరుకోవడానికి, తాత్కాలికంగా వాలంటీర్లు, ప్రైవేట్ సర్వేయర్లను నియమించాలని నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా, 10,621 గ్రామాలలో 19.469 మిలియన్ల సర్వే నంబర్లు ఉన్నాయి. ఈ గ్రామాలలో 9,795 గ్రామాలకు గ్రామ మ్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. 17.436 మిలియన్ల సర్వే నంబర్లకు అనుసంధానించిన పంట భూములను సర్వే చేసే బాధ్యత ప్రైవేట్ సర్వేయర్లు వాలంటీర్లకు అప్పగించారు. మిగిలిన 826 గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఐఖాలు) పోడు భూముల సర్వేలను నిర్వహిస్తారు.ప్రతి గ్రామంలో ఒక స్థానికుడిని వాలంటీర్‌గా ఎంపిక చేస్తారు. ప్రతిరోజూ, వారు 150 నుంచి 200 సర్వే నంబర్లకు సంబంధించిన పంటల ఫొటోలను తీసుకొని మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అధికారులు ఫొటోకు రూ.7 చెల్లింపును నిర్ణయించారు.కేంద్ర ప్రభుత్వం సర్వే కోసం రూ.30.42 కోట్లు కేటాయించింది. వీటిలో రూ.2.93 కోట్లు ఇప్పటికే వర్షాకాల సర్వేకు ఖర్చు చేశారు. మిగిలిన నిధులను ప్రస్తుత రబీ సీజన్ సర్వేను పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు.ఇటీవల, కేంద్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ చావ్లా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై, డిజిటల్ సర్వేను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని నొక్కి చెప్పారు.బీఎస్సీ అగ్రికల్చర్ డిప్లొమా, ఇతర సైన్స్ అర్హతలు ఉన్నవారు లేదా ఇంటర్మీడియట్ లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వారు మొబైల్ యాప్‌లను ఉపయోగించడంలో అన్నీ తెలిసి ఉండాలి. సర్వే పూర్తయ్యే వరకు వారు సెలవు లేకుండా పని చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# ప్రభాస్ కోసం 9వేల కోట్లు.

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

ఈమధ్య కాలం లో ఓటీటీ సంస్థలు నిర్మాతలకు పెడుతున్న ఆంక్షల కారణంగా సినీ నిర్మాతలు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కరోనా లాక్ డౌన్ సమయం లో, కేవలం ఓటీటీ రైట్స్ నుండే నిర్మాతలకు పెట్టిన బడ్జెట్ తిరిగి వెనక్కి వచ్చేది. కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితులు లేవు. ఓటీటీ సంస్థలకు కూడా వరుసగా నష్టాలు రావడం తో, సినిమా థియేటర్స్ లో విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకొని, భారీ వసూళ్లు సాధిస్తేనే మీరు కోరినంత డబ్బులు ఇస్తాము. లేదంటే మాట్లాడుకున్న దాంట్లో 50 శాతం తగ్గించి ఇస్తామంటూ నిర్మాతలకు చెప్తున్నారు. నెట్ ఫ్లిక్స్ , అమెజాన్ ప్రైమ్(సంస్థల రేంజ్ నుండి, చిన్న చిన్న ఓటీటీ సంస్థల వరకు ఇప్పుడు అందరూ ఇదే పద్దతిని అనుసరిస్తున్నారు. ముఖ్యంగా నెట్ ఫ్లిక్స్ సంస్థ గురించి మాట్లాడుకోవాలి.

ఈ సంస్థ ఒక సినిమాని కొనుగోలు చెయ్యాలంటే చాలా అంశాలను పరిగణలోకి తీసుకుంటుంది. ఎంత పెద్ద సూపర్ స్టార్ సినిమాకు అయినా, పైన చెప్పిన ఆంక్షలు తప్పవు, కానీ ఒక్క ప్రభాస్కి మాత్రం ఇలాంటి ఆంక్షలను మినహాయించింది నెట్ ఫ్లిక్స్ సంస్థ. ఇక నుండి రాబోయే ప్రతీ ప్రభాస్ సినిమాని నెట్ ఫ్లిక్స్ సంస్థ కొనుగోలు చెయ్యాలని ఫిక్స్ అయ్యిందట. అందుకోసం 9 వేల కోట్ల బడ్జెట్ టార్గెట్ ని పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 'స్పిరిట్' చిత్రాన్ని కొనుగోలు చేసింది. దాదాపుగా 180 కోట్ల రూపాయిలను ఈ సినిమా కోసం వెచ్చించింది నెట్ ఫ్లిక్స్ సంస్థ. ఈ చిత్రం తర్వాత రాబోయే 'ఫౌజీ', 'కల్కి 2', 'సలార్ 2' చిత్రాలకు విడుదల తేదీలను ప్రకటించగానే కొనుగోలు చేయడానికి సిద్ధం గా ఉందట.వీటితో పాటు ప్రభాస్, ప్రశాంత్ వర్మ కాంబినేషన్ లో రాబోతున్న చిత్రం, ఇక ఆ తర్వాత ఏ సినిమా విడుదలైన నెట్ ఫ్లిక్స్ లోనే ప్రభాస్ సినిమాలు ఉంటాయని టాక్. ప్రభాస్ కోసం వాళ్ళు కేటాయించిన 9000 కోట్ల బడ్జెట్ పూర్తి అయ్యే వరకు ఆయన సినిమాలు కొంటునే ఉంటారట. ఎందుకు నెట్ ఫ్లిక్స్ సంస్థ ప్రభాస్ సినిమాలకు ఇంత మక్కువ చూపిస్తుంది అంటే, ఆయన సినిమాలకు వచ్చిన వ్యూస్ అలాంటివి మరీ. సలార్ చిత్రానికి హిందీ వెర్షన్ లేకుండా ఏకంగా 18 మిలియన్ వ్యూస్ వచ్చాయి. సాధారణంగా నెట్ ఫ్లిక్స్ లోని మన ఇండియన్ భాషల్లో హిందీ బాషలోనే సినిమాలను చూసేందుకు ఎక్కువగా మక్కువ చూపిస్తుంటారు ఆడియన్స్. ఉదాహరణకు 'కల్కి' చిత్రాన్ని తీసుకుందాం, ఈ సినిమా హిందీ వెర్షన్ నెట్ ఫ్లిక్స్ లో విడుదలైంది. కేవలం ఈ ఒక్క వెర్షన్ కి 15 మిలియన్ వ్యూస్ వచ్చాయి. దీనిని బట్టీ హిందీ వెర్షన్ పవర్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. కేవలం ప్రభాస్ సినిమాలకే ఇలా జరిగాయి. చివరికి ఆదిపురుష్ హిందీ వెర్షన్ కి కూడా ఇక్కడ అద్భుతమైన వ్యూస్ వచ్చాయి. ఈ కారణం చేతనే ప్రభాస్ సినిమాలను కొనుగోలు చేయడం కోసం అంతలా పరితపిస్తోంది నెట్ ఫ్లిక్స్ సంస్థ.

# దక్షిణ తెలంగాణ ప్రాంతానికి మహర్దశ

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

దక్షిణ తెలంగాణ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వికారాబాద్- కృష్ణా రైల్వే లైన్ ప్రాజెక్టుపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ లైన్‌కు సంబంధించిన డీపీఆర్ తాజాగా రైల్వే బోర్డుకు చేరింది. ఈ మేరకు అధికారులు కసరత్తు మె?దలు పెట్టారు.తెలంగాణ ప్రజలకు గుడ్‌న్యూస్. త్వరలోనే కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రానుంది. వికారాబాద్- కృష్ణా ప్రతిపాదిత రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక తాజాగా రైల్వేబోర్డుకు చేరింది. దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టును కీలకంగా భావిస్తున్నారు. రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో 130.28 కిమీ మేర దీన్ని రూపొందించారు. రైల్వేబోర్డు అనుమతి లభిస్తే ఈ ప్రాజెక్ట త్వరలోనే పట్టాలెక్కుతుంది.వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ ఎలైన్‌మెంట్ మార్పుచేర్పులతో ఖరారైంది. తొలుత దీనిని 120 కిమీ దూరం ఉంటే.. ఎలైన్‌మెంట్ మారాక 130.28 కి.మీ వరకు పెరిగింది. నిర్మాణ వ్యయం, భూసేకరణ ఖర్చులు కలిపితే అయ్యే మొత్తం ఖర్చు, వచ్చే రాబడి మధ్య చాలా అంతరం ఉందని, ఈ ప్రాజెక్టు లాభసాటి కాదని ముందుగా కేంద్రం అభ్యంతరం తెలిపింది. అయితే దక్షిణ తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని రాష్ట్రం చెబుతోంది. ఈ మేరకు ప్రాజెక్ట చేపట్టాలని కేంద్రాన్ని విన్నవించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో భూసేకరణకయ్యే మొత్తం వ్యయాన్ని భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇదే విషయాన్ని కేంద్రానికి స్పష్టం చేసింది.ఇటీవల కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని తెలిపారు. దాంతో పాటు అలాగే సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా ఈ మార్గాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించారు. తెలంగాణలో మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దు గుడబెళ్లూరు వరకు చేపట్టనున్న 4 లైన్ల జాతీయ రహదారి ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల విడుదలకు పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ కేంద్ర కేబినెట్ భేటీ ముగిసింది. ఈ భేటీలో మహబూబ్‌నగర్-గుడబెళ్లూరు 4 లైన్ల హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొత్తంగా రూ. 1.60 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపారు.ఇక మహబూబ్‌నగర్- గుడబెళ్లూరు ప్రాజెక్టు హైదరాబాద్ - గోవా ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉంది. దీనివల్ల హైదరాబాద్ నుంచి రాయచూర్, మంత్రాలయం, మరియు గోవా వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. రూ.3,175 కోట్ల వ్యయంతో 80.01 కిలోమీటర్లు హ్యామ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ రహదారి మహబూబ్‌నగర్ నుంచి మొదలై.. దేవరకద్ర, మరికల్, మఖ్తల్, మాగనూరు మీదుగా గూడెబల్లూరు ( రాయచూర్ సరిహద్దు) వరకు సాగుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండటానికి మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మఖ్తల్, మరియు మాగనూరు పట్టణాల వద్ద ప్రత్యేకంగా బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు.ప్రస్తుతం ఉన్న 2 లైన్ల రోడ్డును 4 లైన్లుగా మార్చడం వల్ల ప్రయాణ సమయం దాదాపు 1.5 గంటలు తగ్గుతుంది. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఆర్థిక అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుంది. హైదరాబాద్ నుంచి గోవా వెళ్లే వారికి ఇది అత్యంత వేగవంతమైన మార్గంగా మారుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించగా.. టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. భూసేకరణకు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. ఇక రాష్ట్రంలో మరికొన్ని రోడ్డు ప్రాజెక్టులు కూడా ప్రారంభ దశలో ఉన్నాయి. మన్ననూరు- శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. శ్రీశైలం ఆలయానికి దగ్గరగా ఈ కారిడార్ నిర్మించనున్నారు. దీంతో శ్రీశైలం వెళ్లే వారికి సమయంతో పాటు దూరం తగ్గనుంది.అందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ అందించారు.ప్రతిపాదిత కొత్త రైలు లైన్ వికారాబాద్ నుంచి కృష్ణా జంక్షన్ వరకు ఉంది. రైల్వేబోర్డు నుంచి ఆమోదం లభించి.. ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే తెలంగాణలోని పరిగి, కొడంగల్, మక్తల్, నారాయణపేట వంటి ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. అక్కడ పండించే ధాన్యం, పత్తి, మిర్చి వంటి వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఎరువుల సరఫరాతో పాటు సిమెంటు, గ్రానైట్ రవాణాతో పారిశ్రామిక అభివృద్ధికి, కొత్త పెట్టుబడులకు చాలా అవకాశం ఉంటుంది. మె?త్తంగా దక్షిణ తెలంగాణకు మహర్దశ పట్టడంతో పాటు రూపురేఖలు మారిపోతాయి.

# కొత్త సమీకరణాలకు తెర లేపిన కమలం

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ సాధించిన ప్రగతి ఆ పార్టీ శ్రేణుల్లో ఉ



త్సాహాన్ని నింపుతుండగా, క్షేత్రస్థాయిలో ఇంకా ఎదుర్కోవాల్సిన సవాళ్లను కూడా స్పష్టం చేస్తోంది. గతంతో పోలిస్తే ఓట్ల శాతం, సీట్ల సంఖ్య గణనీయంగా పెరగడం ద్వారా కమలనాథులు తమ పట్టును నిరూపించుకున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీజేపీ తన బలాన్ని చాటుకోగా, దక్షిణాది జిల్లాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.ఈ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అతిపెద్ద విజయం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో బీజేపీ ఇక్కడ చరిత్ర సృష్టించింది. గతంలో కేవలం 13 స్థానాలకే పరిమితమైన పార్టీ, ఈసారి ఏకంగా 30 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీల మద్దతుతో మేయర్ పీఠాన్ని దక్కించుకునే దిశగా అడుగులు వేస్తోంది. బండి సంజయ్ తన కంచుకోటలో సత్తా చాటడం పార్టీకి జాతీయ స్థాయిలోనూ గుర్తింపునిచ్చింది.రాష్ట్రంలోని ఆరు ప్రధాన కార్పొరేషన్లలో మహబూబ్‌నగర్ మినహా బీజేపీ, బీఆర్ఎస్ కంటే మెరుగైన ఫలితాలు సాధించడం విశేషం. ఈ ఆరు కార్పొరేషన్లలోని 354 డివిజన్లకు గాను బీజేపీ 69 స్థానాలు గెలుచుకోగా, బీఆర్ఎస్ 48 స్థానాలకే పరిమితమైంది. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ కంటే బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ఆసక్తికరంగా మారింది.బీజేపీ గత ఎన్నికలతో పోలిస్తే తన గ్రాఫ్‌ను గణనీయంగా పెంచుకుంది. గతంలో 239 వార్డుల్లో గెలిచిన బీజేపీ, ఈసారి సుమారు 350 వార్డుల్లో విజయం సాధించింది. గత ఎన్నికల్లో 13 శాతంగా ఉన్న ఓట్ల శాతం, ఈసారి 20 శాతానికి పైగా పెరిగింది. గతంలో ఆమన్‌గల్, మక్తల్‌కే పరిమితమైన చైర్మన్ పదవులు, ఈసారి ఆదిలాబాద్, నారాయణపేట, మెట్‌పల్లి, రాయికల్ వంటి చోట్ల దక్కించుకునే అవకాశం ఏర్పడింది.పార్టీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, వారి నియోజకవర్గాల్లో ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఆదిలాబాద్ లో పాయల్ శంకర్ ఆధ్వర్యంలో 49 వార్డుల్లో 21 స్థానాలు గెలిచి, ఎక్స్-అఫీషియో సభ్యుల మద్దతుతో చైర్మన్ పీఠానికి చేరువయ్యారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి తన పట్టు నిలుపుకున్నారు. 18 స్థానాలు సాధించారు. నిర్మల్ లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో 13 స్థానాలకే పరిమితం కావడం కొంత నిరాశ కలిగించింది. ఆర్మూర్, భైంసా, సిర్పూర్‌లలో పార్టీ ఆశించిన స్థాయిలో సీట్లు సాధించలేకపోయింది.

# ఆత్మరక్షణలో గులాబీ దళం



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భారత్ రాష్ట్ర సమితిని ఆత్మరక్షణలో పడేలా చేశాయి. "అధికార పక్షంపై వ్యతిరేకత ఉంది.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.. గులాబీ జెండా మళ్ళీ రెపరెపలాడుతుంది" అని ఆ పార్టీ అభ్యర్థులు, నేతలు చేసిన ప్రచారం క్షేత్రస్థాయిలో నీటి మూటగానే మిగిలిపోయింది. వెలువడిన ఫలితాలు బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర నిరాశను మిగిల్చాయి.మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ తన హవాను కొనసాగించగా, బీఆర్ఎస్ మాత్రం ద్వితీయ స్థానానికే పరిమితమైంది. మొత్తం స్థానాల్లో కాంగ్రెస్ సగానికి పైగా కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. బీఆర్ఎస్ కేవలం 770 వార్డులకే పరిమితం కావడం ఆ పార్టీ బలాన్ని గణనీయంగా తగ్గించినట్లయింది. హైదరాబాద్ చుట్టుపక్కల మినహా రాష్ట్రవ్యాప్తంగా గులాబీ పార్టీ గ్రాఫ్ పడిపోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.బీఆర్ఎస్ వైఫల్యానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ కు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఇప్పుడు కాంగ్రెస్ చొచ్చుకుపోయింది. హైదరాబాద్ చుట్టుపక్కల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని మున్సిపాలిటీల్లో మాత్రమే బీఆర్ఎస్ ప్రభావం చూపగలిగింది. కానీ, ఉత్తర తెలంగాణ, ఉమ్మడి నల్గొండ వంటి ప్రాంతాల్లో పార్టీ గాలి తీసేసింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతమే ఇప్పుడు కూడా కొనసాగింది. అంటే, పార్టీ కొత్తగా ఓటర్లను ఆకర్షించలేకపోయింది. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు" తమకే పడుతుందని ఆశించిన బీఆర్ఎస్ కు, ఆ ఓట్లు చీలిపోవడం లేదా కాంగ్రెస్ వైపు మొగ్గడం పెద్ద దెబ్బ. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుసగా ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పార్టీని వీడటం కేడర్ లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను నడిపించే నాథుడు కరువవ్వడం బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం.మున్సిపల్ ఫలితాలను విశ్లేషిస్తే, బీఆర్ఎస్ కేవలం 'గ్రేటర్ హైదరాబాద్' పార్టీగా మారుతోందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. సిటీ శివారు మున్సిపాలిటీల్లో ఆశించిన ఫలితాలు వచ్చినప్పటికీ, జిల్లాల్లోని పురపాలికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. నల్గొండ కార్పొరేషన్ ను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం?, కరీంనగర్, నిజామాబాద్ లో బీజేపీ గట్టి పోటీ ఇవ్వడం చూస్తుంటే బీఆర్ఎస్ కు తన సొంత ప్రాబల్యం ఉన్న చోట కూడా పట్టు తప్పుతోందని స్పష్టమవుతోంది.అధికారంలో ఉన్న పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఎడ్జ్ ఉండటం సహజమేనని బీఆర్ఎస్ నేతలు సరిపెట్టుకోవచ్చు. కానీ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ వరుస విజయాలు సాధించడం అనేది కేవలం అధికార ప్రభావం మాత్రమే కాదు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలు, పట్టణ మౌలిక సదుపాయాలపై పెట్టిన దృష్టి ఓటర్లను ఆ పార్టీ వైపు తిప్పుకున్నాయి. బీఆర్ఎస్ నేతలు కేవలం సోషల్ మీడియాలో, టీవీ డిబేట్లలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి నమ్మకాన్ని కలిగించడంలో విఫలమయ్యారనేది రాజకీయ విశ్లేషకులు చెప్తున్నమాట.బీఆర్ఎస్ ఇకనైనా తన పంథాను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం హైదరాబాద్ కేంద్రంగా రాజకీయం చేస్తే సరిపోదని ఈ ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. వార్డు స్థాయి నుండి కమిటీలను బలోపేతం చేయాలి. కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనకపోవడం పార్టీకి మైనస్ అవుతోంది. కేవలం కేటీఆర్, హరీష్ రావులపైనే భారం వేయడం వల్ల జిల్లాల్లో పట్టు కోల్పోతున్నారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై పోరాటాలు చేయడంలో బీఆర్ఎస్ వెనుకబడిందనే భావన ఉంది.మొత్తానికి, ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ కు ఒక వేక్-అప్ కాల్. రాబోయే ఎన్నికల నాటికైనా పుంజుకోవాలంటే, ఆ పార్టీ తన వ్యూహాలను సమూలంగా మార్చుకోవాల్సిందే. లేదంటే తెలంగాణ రాజకీయాల్లో రెండో స్థానాన్ని కూడా కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

రేవంత్ ట్రాప్ లో గులాబీ టీమ్

2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి ఆ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఒక సీటు కూడా పార్లమెంట్లో లేకపోగా ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కూడా పార్టీ ఓటమిపాలైంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే విషయంలో గులాబీ పార్టీ సరైన వ్యూహాలు రచించలేదు అనే విమర్శలు కూడా వచ్చాయి పంచాయతీ ఎన్నికల్లో సైతం పార్టీ సత్తా చాట లేకపోవడం ఆందోళన కలిగించింది. బలంగా ఉన్న జిల్లాలో కూడా పార్టీ క్యాడర్ అనుకున్న స్థాయిలో ఫలితాలను రాబట్ట లేకపోయింది. ఇక తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంత్రులుగా పనిచేసిన వారి నియోజకవర్గాల్లో కూడా పార్టీ ఓటమి పాలు కావడం అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీ ఒకప్పుడు బలంగా కనపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ దెబ్బకు ఈ జిల్లాలో పూర్తిగా గులాబీ పార్టీ కనుమరుగైన పరిస్థితి కనపడుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కటంటే ఒక్క మున్సిపల్ స్థానాన్ని కూడా ఆ పార్టీ కైవసం చేసుకో లేకపోయింది.

నిజామాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఆ పార్టీకి ఎదురైంది. నిజామాబాద్ జిల్లాలో కూడా పార్టీ ఖాతా తెరవలేదు. 116 స్థానాల్లో ఎన్నికలు జరిగితే కేవలం 13 స్థానాల్లో మాత్రమే పార్టీ విజయం సాధించడం పట్ల అధిష్టానం తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీని వెనక కారణాలేంటి అనేది పక్కన పెడితే నాయకులను మార్చాల్సిందే అనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. పార్టీ నేతలు అందరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ముందుకు వెళ్లడమే మినహా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడం లేదని విమర్శలు కూడా ఉన్నాయి. రేవంత్ రెడ్డి చేస్తున్న విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం మినహా, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని ఆవేదన కేడర్లో వ్యక్తం అవుతుంది. ఎంతసేపు అధిష్టానం మెప్పుకోసం ప్రయత్నం చేయడం మినహా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోవడాన్ని కేడర్ జీర్ణించుకోవడం లేదు. కనీసం ఉమ్మడి మెదక్ జిల్లాలో కూడా పార్టీ బలంగా ప్రభావం చూపించలేకపోవడాన్ని కేడర్ తప్పుపడుతోంది.

# మూడు ప్రాంతాల్లో 3 ఎకనామిక్ రీజియన్స్

విజయవాడ,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. బడ్జెట్ లో తాజాగా కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించి, అన్ని జిల్లాల్లో సమాన వృద్ధిని సాధించడమే ఈ భారీ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో.. విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలు కోసం ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చేందుకు, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రాంతీయ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించిందని చెప్పారు. నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కి ఎకనమిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేశామని చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారువిశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఏడు గ్రోత్ ఇంజిన్లు ఉన్నాయి. వీటిలో మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయంలో 41హై ఇంపాక్ట్ ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని చెప్పారు. వాటికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల నుంచి సమకూర్చుకుంటామని పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అంతేకాదు.. మెట్రో రైల్ ప్రాజెక్టులు సహా వీఈఆర్ కి సంబంధించి సుమారు 28వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పిస్తున్నామని



చెప్పారు.వీఈఆర్ తరహాలోనే అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఈ రీజియన్ పరిధిలోకి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలు రానున్నాయి. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి దోహదం చేసే వనరులు.. గ్రోత్ ఇంజిన్లు, బలాల్ని గుర్తించేందుకు శాస్త్రీయ పద్దతుల్లో సామాజిక, ఆర్థిక అధ్యయనం నిర్వహిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ తెలిపారు.వీఈఆర్, అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి తరహాలో.. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ను ప్రభుత్వం సిద్ధం చేసింది. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని 303 మండలాల్లో 200పైగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్స్ గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

================

# అదే తీరు...అదే జోరు..!

## చాపకింద నీరులా కల్తీ మద్యం...?

**చిన్న బ్రాండ్‌లే లక్ష్యంగా కల్తీ...సీల్, క్యాప్ ఉన్నది ఉన్నట్లే...**
**సిండికేట్ ముసుగులో అక్రమ తతంగం...?**
**మద్యం ప్రియుల ఆరోగ్యాలను హరిస్తున్న స్పిరిట్..మద్యం ప్రవాహం పై జోరుగా చర్చ...జాడ లేని "ఆ" శాఖ.. అధికారులు ఎక్కడ..?**
**సామాజిక సేవకులు కర్నె బాబురావు**




భద్రాద్రి కొత్తగూడెం భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

మద్యపానం ఆరోగ్యానికి హానికరం అన్నమాట చాటున మద్యం ప్రియుల ఆరోగ్యా లకు మరింత చేటు అయ్యేలా చిన్న బ్రాండ్‌లే లక్ష్యంగా అశ్వాపురంలో కల్తీ దందాకు సిండికేట్ ముసుగులో కొందరు అక్రమార్కులు తెరలేపారని, సామాజిక సేవకులు కర్నే బాబురావు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ,డబ్బు అక్రమ సంపాదనే లక్ష్యంగా పావులు కదుపుతూ మద్యం బాటిళ్లలో కల్తీ చేస్తూ కొందరు,మద్యం బ్రాండ్లలో స్పిరిట్, కలుపుతూ నయా దందాకు తెరలేపారన్నారు. క్వాటర్ సీసా మొదలు ఫుల్ బాటిళ్ల వరకు యథేచ్ఛగా మద్యాన్ని కల్తీ చేస్తూ లిక్కర్ మాఫియా లక్షల్లో ఆర్జిస్తున్నారన్న చర్చ డివిజన్ వ్యాప్తంగా వ్యక్తం అవుతోందన్నారు. ముఖ్యంగా మద్యం కల్తీకి సంబంధించి చిన్న బ్రాండ్లు, ఎక్కువ అమ్మకాలు జరిగే మద్యం బాటిళ్లను అక్రమార్కులు ఎంచుకుంటున్నారని,ఆ మండల కేంద్రంగా రాయల్ స్టాగ్, ఐబీ, ఎమ్ హెచ్, మొదలుకుని సిగ్నేచర్, బ్లెండర్స్ ప్రైడ్ వరకు అందుబాటులో లేవనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఓవైపు కొన్ని బ్రాండ్లను వైన్ షాపులో పూర్తిగా దొరక్కుండా చేసి, బెల్ట్ షాపులకు తరలించి ఆ బ్రాండ్లపై భారీగా ఆదాయాన్ని సొమ్ముచే సుకుంటున్న సిండికేట్ మాఫియా మరో వైపు వైన్ షాపులలో నౌకరి నామా లేకుండా ఓ విలేకరి కౌంటర్లో కూర్చొని, ఆయన ప్రొద్దు బలం తోనే ఇదే బ్రాండ్లను దొడ్డి దారిలో బెల్ట్ షాపులకు విక్రయించి ఆ బ్రాండ్లపై భారీగా ఆదాయాన్ని పొందుతుంతరన్నారరు. ఇలా రెండు వైపులా ఆదాయాన్ని పొందిన వైన్ షాప్ నిర్వాహకులు ధన దాహం చాలదు అన్నట్టుగా వ్యవహరిస్తూ సిండికేట్‌గా ఏర్పడిన సదరు వ్యక్తు లు కల్తీ సరుకును బెల్ట్ షాపులకు తరలించి, విక్రయాలు జరుపుతూరనివిమర్శించారువిటి కల్తీకి బెల్ట్ షాపులలో ఎవరూ పెద్దగా ఫిర్యాదులు చేయరన్న ధైర్యంతో నిస్సిగ్గగా కల్తీకి పాల్పడుతున్నా రని, నిత్యం మద్యం సేవించే మందు బాబులు మద్యంలో తేడాను గమనించి సదరు బెల్ట్ షాపు నిర్వాహకులతో గొడవలకు దిగుతున్న సందర్భాలు అనేకం ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నాయన్నారు.మద్యం కల్తీకి సంబంధించి భౌతికంగా ఎలాంటి అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వారి పనితనానికి నిదర్శనంగా మారిందన్నారు. ఇందుకోసం ఏండ్లుగా బార్, వైన్స్‌ల్లో పని చేసిన ఓ అనుభవజ్ఞులైన వారిని ఈ అక్రమ దందాకు వాడుకుంటున్నట్లు తెలుస్తుందన్నారు.బాటిల్ సీల్, క్యాప్ ఓపెన్ చేసి మద్యం కల్తీ చేసిన అనంతరం యధావిధి గా మళ్లీ బిగిస్తున్నారని,అనంతరం అసలు మద్యం బాటిళ్ల మాదిరిగానే ఇవి మద్యం ప్రియుల చేతు ల్లోకి వెళ్తున్నాయన్నాని బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్న వారి పై కఠిన చర్యలు చేపట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు క్షణం తీరిక లేదు, మాకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారుల స్పందించాలని, నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న విచ్చలవిడి మద్యం తరలింపు, కల్తీ మద్యం పై చర్యలు చేపట్టాలని,బాబురావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమి షనర్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రికి స్వయంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## కోదాడ మునిసిపల్ చైర్ పర్సన్‌గా ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు.

**సమన్వయంతో చైర్మన్ పదవి అందుకున్న కుసుమ వెంకటరత్నం బాబు.**
**మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి ల సహకారంతో చైర్పర్సన్ పదవికి ఎంపిక**



సూర్యాపేట భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక పీట ముడి ఎట్టకేలకు అధిష్టానం విప్పింది. కోదాడ పీఠంపై మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి లు అంగీకారం తెలుపుతూ కూర్చోబెట్టారు. గత రెండు రోజులుగా హైదరాబాదులోని క్యాంపులో పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ సమన్వయం చేసి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎర్నేని వెంకటరత్నం బాబు అపార రాజకీయ అనుభవం , కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి లు గుర్తించారు. ఇదే క్రమంలో బాబు సహితం అగ్ర నాయకుల అందర్నీ సమన్వయం చేసుకొని పదవిని దక్కించుకున్నారు. ఎర్నేని బాబు మాజీ సర్పంచ్ గా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదవులు నిర్వహించడంతోపాటు పార్టీ పరంగా అనేక పదవులు చేపట్టారు. మున్సిపల్ ఎన్నికల ముందు నుండే ఆయన ఈ పదవిని ఆశిస్తూ అదే ప్రయత్నంలో ఉన్నారు. రిజర్వేషన్ జనరల్ మహిళా కావడంతో తన శ్రీమతి కుసుమ ను కౌన్సిలర్ గా పోటీ చేయించి ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్ లు సహితం బాబు కు ప్రాధాన్యత ఇవ్వాలనే మాట కు అనుకూలంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఎర్నేని వెంకట్ రత్నం బాబు తమ కు అవకాశం ఇచ్చిన మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి లతో పాటు,స్థానిక నాయకులకు, కౌన్సిలర్ లకు ధన్య వాదాలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.లాంఛన ప్రాయంగా చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక.చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు క్యాంపు నుండి కౌన్సిలర్ లతో ఎమ్మెల్యే పద్మావతి బస్సు లో కోదాడ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఎన్నిక పూర్తి అయ్యే వరకు ఉండి మునిసిపాలిటీ చేజరా కుండా తీవ్రంగా కృషి చేశారు. కాగా లంచనా ప్రాయంగా జరిగిన ఎన్నికలో చైర్ పర్సన్ కు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు ప్రతిపాదించగా, కౌన్సిలర్ షఫీ బలపరిచారు.

వైస్ చైర్మన్ కు కౌన్సిలర్ కొల్లా కోటిరెడ్డి ప్రతిపాదించగా కౌన్సిలర్ షాబుద్దీన్ బలపరిచారు. మొత్తం 35 మంది కౌన్సిలర్ల లో పోటీ లేకపోవడంతో ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు చైర్ పర్సన్ గా, దేవరపల్లి మహేశ్వరి వైస్ చైర్మన్గా లాంచన ప్రాయంగా ఎన్నికయ్యారు. ఆర్డిఓ సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా చైర్మన్ గా ఎన్నికైనకుసుమ బాబు, వైస్ చైర్మన్ దేవర పల్లి మల్లేశ్వరి లను నాయకులు కార్యకర్తలు పూల మాలలు, శాలు వాలతో బొకే లతో నూతన చైర్మన్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మాస్టర్ ట్రైనర్ పబ్బతి వెంకటేశ్వర్లు ఉన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి , శివ శంకర్ల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## యువత క్రీడల్లో రాణించాలి

కమాన్ పూర్ ఫిబ్రవరి 16.

యువత క్రీడల్లో రాణించాలి అని కమాన్ పూర్ మండలం పెంచికలపేట గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అయిలవైన మల్లేష్ అన్నారు. పెంచికల్పేట గ్రామంలో ఆదివారం రాత్రి శివరాత్రి సందర్భంగా సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ను ఏర్పాటు చేశారు.శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పిడుగు రాజు,విష్ణు,రాఖీ పెగడపల్లి,ఇరుగురాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఐలవేని మల్లేష్ టోర్నమెంట్ స్పాన్సర్ గా వ్యవహరించిన నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నీలో విజేతలుగా పిడుగు రాజు కెప్టెన్ గా వ్యవహరించిన టీం అనవేన మహేష్, అనవేన రవి,కుంభం మధు, కలవేన ప్రశాంత్,ధబ్బేట శేషు, అనవేన రవి మొదటి విజేతలుగా, మరియు రాఖీ పెగడపల్లి కెప్టెన్ గా వ్యవహరించిన టీం ఇరుగురాల శ్రీధర్,రోహిత్,చక్రి, బానేశ్, అనవేన వేణు,మనోహర్,పల్లె ఈశ్వర్ రన్నరప్ విజేతలుగా నిలిచారు.టోర్నీ లో గెలిచిన విజేతలకు టోర్నీ స్పాన్సర్ గా వ్యవహరించిన ఐలవేన మల్లేష్ మనీ ప్రైజ్ అమౌంట్ తో పాటు ట్రోఫీ లు అందచేసి కృతజ్ఞతలు తెలియచేశారు.అలాగే టోర్నీలో పాల్గొన్న టీం సభ్యులు అందరు మరియు నిర్వాహులు ఇటువంటి టోర్నీకి స్పాన్సర్ గా వ్యవహరించి యువతను క్రీడాకారులను ప్రోత్సహించినందుకు ఐలవేన మల్లేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేశారు.

## ఎంపి కావ్యపై ఎన్నికల సంఘానికి పిర్యాదు

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య డబుల్ ఓట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ సభ్యురాలు లలితా రెడ్డి మాట్లాడుతూ వరంగల్ ఎంపీగా కావ్య.. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్లో ఎక్స్ అఫిషియో మెంబర్ గా ప్రమాణ స్వీకారం చేసి, మళ్ళీ తొర్రూరులో ఎక్స్ అఫిషియో మెంబర్ గా నమోదు చేయించుకున్నారు. ఇది ఎన్నిక కోడ్ ఉల్లంఘనలకు విరుద్ధం. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ కు ఫిర్యాదు చేశాం. ఈ విషయంలో కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరామని అన్నారు.




30 రోజుల ముందే నోటీస్ ఇవ్వాలి. కానీ అలా చేయకుండా ఒకటి రెండు రోజుల్లోనే నమోదు చేయించుకుని ఓటు వేయడానికి సిద్ధం అయ్యింది. ఇది న్యాయ పరంగా చెల్లదని అన్నారు.

బీఆర్ఎస్ నేత కిషోర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. కావ్యకి వరంగల్ మున్సిపాలిటీలో ఓటు ఉన్నా.. మళ్ళీ రెండో ఓటు తొర్రూరులో వేయడానికి సిద్ధపడుతున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకొని దేశమంతా తిరుగుతున్నారు, ఇక్కడేమో కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ కచ్చితంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## చిన్నారుల నృత్యాలు అభినందనీయం

కమాన్‌పూర్: భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

కమాన్ పూర్ మండల కేంద్రంలో శ్రీ శ్రీ చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిరస కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శన అభినందనీయమని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి అన్నారు.మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కమాన్‌పూర్ మార్కెట్ ఏరియాలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉత్సవాలు భక్తి,సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచాయి. ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో సాగి స్థానికులను ఆకట్టుకున్నాయి.పవిత్ర వేడుకలలో భాగంగా ఆర్కెస్ట్రా భక్తి గీతాలతో సభను పరవశింపజేసింది.శ్రీ శారద నృత్య కళాపీఠం ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక,సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారుల భావవ్యక్తీకరణ,లయబద్ధత,వేదికపై ఆత్మవిశ్వాసం సభలో చప్పట్ల వర్షం కురిపించింది.శివతాండవ నృత్యాలు ఆధ్యాత్మిక పరవశాన్ని కలిగించాయి.యువసేన ఏర్పాటుచేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ కార్యక్రమాలకు ప్రత్యేక శోభను తెచ్చింది.వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,ప్రత్యేక ప్రసంగాలు,భక్తి ప్రదర్శనలు కుటుంబ సమేతంగా హాజరైన ప్రజలను ఆకట్టుకున్నాయి.

## ఈ నెల 19, 20 న ఓయూలో వీసీల మీట్

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

ఫిబ్రవరి 19,20 వ తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో వైస్ ఛాన్సలర్స్ మీట్ 2025 - 26 నిర్వహించనున్నారు.ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఓయూ వీసీ ప్రో.కుమార్ ఓయూ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ మీట్ కు రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వీసీ తెలిపారు.ఈ మీట్ కు ఆరు రాష్ట్రాల నుండి 120 మంది వైస్ ఛాన్సలర్లు పాల్గొంటారని వివరించారు. ఈ మీట్ ముఖ్యంగా ఉన్నత విద్యలను ఏ విధంగా బలోపేతం చేయాలి, నైతిక విలువలతో కూడిన పాలనా విధానాన్ని ఏ విధంగా కొనసాగించాలి, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వల్ల జరిగే లాభాలు నష్టాలు ఏ విధంగా ఉంటాయి, ఉన్నత విద్యలో విధానపరమైన సంస్కరణల పైన, విశ్వవిద్యాలయాల పరస్పర అనుసంధానం ఏ విధంగా కొనసాగాలి అనే విషయాలపైన చర్చ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఓయూ రిజిస్టర్ ప్రో. నరేష్ రెడ్డి, ఓ ఎస్ డి ప్రో. జితేందర్ నాయక్, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రో. చంద్రశేఖర్, సి ఎఫ్ డి ఆర్ డైరెక్టర్ ప్రో.సుజాత తదితరులు పాల్గొన్నారు.

### బుల్లెట్ దిగిందా?..

సంగారెడ్డి ఫిబ్రవరి 16.

పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సినిమా డైలాగ్ కొట్టారు. పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ, స్థానిక నేతలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసారు. బుల్లెట్ దిగిందా లేదా అంటూ డైలాగ్ చెబుతూ మహిపాల్ రెడ్డి వెళ్లిపోయారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీలను బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసింది. గుమ్మడిదల, గడ్డపోతారం, ఇంద్రేశం మున్సిపాలిటీలను దక్కించుకుంది. బీజేపీ కౌన్సిలర్ల మద్దతుతో జిన్నారం, బీజేపీ ఎంపీ రఘునందన్ ఎక్స్ అఫిషియో ఓటుతో ఇస్నాపూర్ మున్సిపాలిటీలను కుడా దక్కించుకుంది. ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ పీఠం బిఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ గా మోటే సుమలత, వైస్ చైర్మన్ గా మాధవి సరిత నరేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పల గణేష్ చక్రవర్తి, వైస్ చైర్మన్ అప్పల కావ్య



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,ఫిబ్రవరి 16 (భారత శక్తి) నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పాల కావ్య, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పాల గణేష్ చక్రవర్తి సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్కను అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన వారికి కలెక్టర్ వారిని శాలువా, జ్ఞాపికతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పట్టణ సర్వతోముఖాభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహకారం అందించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక.

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (భారత శక్తి): ములుగు జిల్లా మున్సిపాలిటీ లో నూతనంగా పురపాలక సంఘం చైర్మన్ చింతన చంద్రకళ భిక్షపతి వైస్ చైర్మన్ ఆసియా సాహిబ్ మీర్జాల ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు 20 మంది కౌన్సిలర్ లతో ఆర్డీవో వెంకటేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. 06 వ వార్డు కౌన్సిలర్ ములుగు మున్సిపాలిటీ చైర్మన్ గా చింతనిప్పుల చంద్ర కళ, 14 వ వార్డు కౌన్సిలర్ వైస్ చైర్మన్ గా ఆసియా షాహిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్ అఫిషియో మెంబర్ పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్



పర్యవేక్షణ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు వివిధ పార్టీల కౌన్సిలర్లు తదితరులు హాజరయ్యారు.

# కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ఓటర్లకు కృతజ్ఞతలు:టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి అధికారాన్ని అందించినందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి సదాశివపేట పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓ కుటుంబ సభ్యుడిగా భావించి ముఖ్యమైన బాధ్యతలను అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రజలకు రుణపడి ఉంటాను అన్నారు. తెలియకుండా ఏమైనా తప్పులు జరిగే అవకాశం ఉంటే అలాంటి అవకాశాలకు చోటు ఇవ్వవద్దన్నారు. ఇళ్ల నిర్మాణం చేసేటప్పుడు అక్రమ వసూళ్లకు పాల్పడితే చెడ్డ పేరు వస్తుందన్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలోనే సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన వార్డులకు 8 కోట్లు మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. నాలుగు నెలల్లోగా పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ఓడిన అభ్యర్థులు సైతం నేను కౌన్సిలర్ లానే పరిగణిస్తానన్నారు. ఓడిన అభ్యర్థులు వారి వార్డులలో జరిగే అభివృద్ధి పనులు వారి కను సన్నల్లోనే జరుగుతాయన్నారు. ప్రతి ఎన్నికల్లో సంగారెడ్డి పట్టణ ప్రజలు సదాశివపేట పట్టణ ప్రజలు తనకు మద్దతుగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూతన కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోటప్ప కొండలో ముగిసిన వికసిత భారత్, వందేమాతరం చిత్ర ప్రదర్శన

గుంటూరు, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో "వికసిత భారత్ – పల్నాడు పురోగతి మరియు వందేమాతరం 150 సంవత్సరాలు" ఇతివృత్తంతో కోటప్పకొండలో నిర్వహించిన చిత్ర ప్రదర్శన సోమవారం ఉదయం ఘనంగా ముగిసింది. రెండురోజుల ప్రదర్శనను నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రారంభించారు.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో వికసిత భారత్ నిర్మాణానికి చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు , వందేమాతరం 150 సంవత్సరాలతో పాటు 20 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల మీద సీబీసీ ఈ చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసింది. విలువైన సమాచారంతో కూడిన వందేమాతరం గేయ చరిత్రకు సంబంధించిన చిత్రాలతో పాటు దేశ, రాష్ట్ర, పల్నాడు జిల్లా స్థాయి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడానికి సీబీసీ చేసిన కృషిని లావు శ్రీకృష్ణ అభినందించారు. సందర్శించిన విద్యార్థులు, ప్రజలకు వందేమాతరం చిత్ర ప్రదర్శన, నూతన వీబీ జీ రామ్ జీ పథకం విశేషాలను సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఆర్ రమేష్ చంద్ర వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో గడచిన పదకొండున్నరేళ్లుగా దేశవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా సందర్శకులకు ఆయన వివరించారు. విధుల్లో ఉన్న జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు చిత్ర ప్రదర్శనను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం పాటు వి.దుర్గారావు నేతృత్వంలోని శ్రీ షిర్డీ సాయిబాబా తోలుబొమ్మలాట బృందం పాటు వినోదాన్ని అందించింది. జాగరణలో ఉన్న భక్తులు వివిధ రామాయణ ఘట్టాలపై తోలుబొమ్మలాటను ఆసక్తిగా తిలకించారు.

# పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్‌తో లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్, కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్, ఉప్పల్ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించుకుంది.

ఈ భాగస్వామ్యం ద్వారా కళాశాలలో "నలంద ౖ=ూ×--ాఖీణజ స్టూడెంట్ ఫోరం" స్థాపించబడింది. విద్యా రంగం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే ఈ భాగస్వామ్య ముఖ్య ఉద్దేశం.





ఈ ఒప్పందం ప్రకారం 2026--27, 2027--28 విద్యా సంవత్సరాలలో విద్యార్థి కేంద్రిత కార్యక్రమాల శ్రేణి నిర్వహించబడుతుంది. వీటి ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక అనుభవం, పరిశ్రమల అవగాహన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభిస్తాయి.

వీశిఖ కార్యక్రమానికి ౖ=ూ× హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. యాదగిరి కంభంపాటి, సీనియర్ మెంబర్ శ్రీ కృష్ణ బాజీ (కన్వీనర్), నలంద ఇనిషియేటివ్ సహ-కన్వీనర్ డా. ఫాతిమా రహీమ్, అలాగే హైదరాబాద్ చాప్టర్ నలంద స్టూడెంట్ ఫోరం సబ్ కమిటీ కమిటీ సభ్యుడు, మాజీ చైర్మన్ కె. గోవింద్‌రాజ్ హాజరయ్యారు.

డా. యాదగిరి కంభంపాటి మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్, నలంద స్టూడెంట్ ఫోరం 11 విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసుకుని దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు.

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీమతి పి. జయంతి రెడ్డి మాట్లాడుతూ, "మా లక్ష్యం 'అకాడెమిక్స్‌ను పరిశ్రమలతో అనుసంధానం చేయడం'. ౖ=ూ×తో ఈ భాగస్వామ్యం మా దృష్టిని మరింత ముందుకు తీసుకెళ్తుంది" అని అన్నారు.

హైదరాబాద్ చాప్టర్ మాజీ చైర్మన్ లయన్ కె. గోవింద్‌రాజ్ ప్రధానోపన్యాసం అందించారు. 'ూ= ఒక వృత్తిగా'' అనే అంశంపై ఆయన తన అభిప్రాయాలను పంచుకుంటూ, మంచి ౖ= నిపుణుడిగా మారేందుకు అవసరమైన నైపుణ్యాలు, వృత్తి అవకాశాల గురించి వివరించారు

PRSI మాజీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ (దక్షిణ), నలంద ఫోరం సబ్ కమిటీ కన్వీనర్ కృష్ణ బాజీ మాట్లాడుతూ, ౖ=ూ× ప్రారంభించిన వివిధ కార్యక్రమాలలో హైదరాబాద్ చాప్టర్ సాధించిన విజయాలను వివరించారు.

హైదరాబాద్ చాప్టర్ నలంద ఫోరం సబ్ కమిటీ సహ-కన్వీనర్ డా. ఫాతిమా రహీమ్ మాట్లాడుతూ, "ూ=ూ×-నలంద స్టూడెంట్ ఫోరం అనేదిౖ=, కమ్యూనికేషన్ రంగంలోని ప్రస్తుత ధోరణులపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఒక అర్థవంతమైన కార్యక్రమం" అని పేర్కొన్నారు.


ఈ కార్యక్రమానికి లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్ ఆర్ట్స్ విభాగాధిపతి శ్రీమతి థానే సవారియప్ప, మాస్ కమ్యూనికేషన్ డ జర్నలిజం విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నోబిన్ చార్లీ కూడా హాజరై, విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దేందుకు మెంటార్‌షిప్ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే ప్రాముఖ్యతను తెలిపారు.

# 6 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ ఖాజా నవాజుద్దీన్ ప్రమాణ స్వీకారం – విజయోత్సవ ర్యాలీలో కౌన్సిలర్ అభ్యర్థి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16



అభివృద్ధి నా లక్ష్యం నా ఆరవ వార్డు ప్రజలు నన్ను ఎన్నుకున్నారు వార్డు అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తాను. మహమ్మద్ ఖాజా నవాజ్ ఉద్దీన్ అన్నారు.సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఎన్నికల కమిషనర్ జానకిరామ్ మున్సిపల్ ఎన్నికల కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చేసిన 6 వార్డు అభ్యర్థి మహమ్మద్ ఖాజా నవాజుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న మహమ్మద్ కాజా నవాజుద్దీన్ 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ లో నమ్మిన బంటుగా పనిచేస్తూ వస్తున్నారు. పార్టీలో ఎంతోమంది మారినా నవాజ్ మాత్రం కాంగ్రెస్ వీడలేదు, నవాజ్ యొక్క సిన్సియారిటీ ని చూసిన అధిష్టానం కౌన్సిలర్ అభ్యర్థిగా టికెట్టు ప్రకటించింది. అనంతరం బరిలోకి దిగిన నవాజ్ ఇంటింటికి తిరుగుతూ ఒక్క అవకాశం ఇవ్వండి గెలుపు కోసం ఆరవ వార్డు అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తాం అంటూ మాట ఇచ్చాడు. అప్పుడు అదే చెప్పాను ఇప్పుడు ఇదే చెప్తున్నాను అంటూ మీడియాతో మాట్లాడుతూ నవాజుద్దీన్ నామీద నమ్మకంతో ప్రజలు నన్ను గెలిపించారు. పార్టీ కూడా టికెట్ ఇచ్చింది అవకాశం వచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ లో పనిచేస్తున్నాను. అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డు అభివృద్ధి కోసమే పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించి వాటిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని జగ్గారెడ్డి నిర్మల జగ్గారెడ్డి సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి వార్డును అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తానని తన ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తాను. వార్డు ప్రజల సహకారంతో కాలనీలో ఉన్నటువంటి సమస్యలను అందరి సహకారంతో పరిష్కరిస్తానని ఇప్పటికే కాంగ్రెస్ అధిష్టానం ప్రతి వార్డుకు 8 కోట్లు అభివృద్ధి పనుల కోసం కేటాయించడం జరిగిందని వార్డులో సిసి రోడ్లు వీధిలైట్లు విశాలమైన రోడ్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి తన వంతు కృషి చేస్తానని మహమ్మద్ ఖాజా నవాజుద్దీన్ మీడియాతో తెలిపారు. తన ముందు అనేక సవాళ్లు ఉన్నాయని తెలుసని అధికారంలో లేనప్పుడు కూడా తన సొంత ఖర్చుతో పని చేశానని నేను చేసిన పనిని అధిష్టానం గుర్తించి నాకు టికెట్ కేటాయించడం జరిగిందని తన విలువైన సమయాన్ని వార్డు ప్రజలకు కేటాయిస్తానని మహమ్మద్ ఖాజా నవాజ్ తెలిపారు . కాలనీవాసులు మాత్రం సమస్యలు గత కొన్ని సంవత్సరాలుగా ఉన్నాయని గత 40 ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలు ఇప్పుడు పరిష్కారం అవుతాయి అనే నమ్మకంతో ఉన్నామని కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ గెలిచాడు అధికారంలో కాంగ్రెస్ కూడా ఉన్నది కాబట్టి అభివృద్ధి చేయాల్సిందేనని చేస్తామని హామీ ఇచ్చారని కాలనీవాసులు పేర్కొన్నారు.



# మున్సిపల్ వైస్ చైర్మన్ గా సూర్నప్ సోమయ్య

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (భారత శక్తి ): మహబూబాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా రెండోసారి సిపిఎం 29వ వార్డు కౌన్సిలర్ సూర్నప్ సోమయ్య కాంగ్రెస్ మద్దతుతో వైస్ చైర్మన్ గా నియమితులయ్యారు. గతంలో మున్సిపాలిటీ ప్రారంభం నుంచి మొదటగా వైస్ చైర్మన్ గా, వార్డు కౌన్సిలర్ గా, వైస్ చైర్మన్ కొనసాగుతున్నారు.

# ప్రశాంతంగా సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

## – తొమ్మిది మున్సిపాలిటీల చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక పూర్తి
## – సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అధీకృత అధికారులు
## జహీరాబాద్, ఇంద్రేశం చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక రేపటికి వాయిదా

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16:

సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం,చైర్ పర్సన్ , వైస్ చైర్ పర్సన్ ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గ నిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశం అదీకృత అధికారి జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి.

ఆయా పార్టీల సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో అధీకృత అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు, పారదర్శకంగా పూర్తయ్యింది.

జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, అందోల్ --జోగిపేట్, కోహిర్, నారాయణఖేడ్, ఇస్నాపూర్, గుమ్మడిదల గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. అయితే జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో సరిపడా కోరం లేనందున ఆయా మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.మున్సిపల్ కమిషనర్లు, అదీకృత అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. ఉదయం 11 గంటలకు మొదటగా వార్డు సభ్యులుగా ఎన్నికైన సభ్యులందరికీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు సరి పడు కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు.చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లను అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపాలిటీ వారీగా చైర్మన్, వైస్ చైర్మన్‌ల వివరాలు ఆందోల్-జోగిపేట్ మున్సిపల్ చైర్మన్ గా సోమ్మిరెడ్డి కృష్ణారెడ్డి ( కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా ఆకుల సత్యనారాయణ( కాంగ్రెస్),

గడ్డపోతారం:

చైర్ పర్సన్ గా శ్రీమతి గద్దె సుష్మ,( బిఆర్ఎస్ )

వైస్ చైర్మన్ గా లక్ష్మ గోని మహేందర్ గౌడ్ (బిఆర్ఎస్ )

గుమ్మడిదల:

చైర్మన్ చిన్న పాపాని కుమార్ గౌడ్ ( బిఆర్ఎస్)

వైస్ చైర్ పర్సన్ గా

శ్రీమతి చిమ్ముల సంధ్య( బి ఆర్ఎస్ )

ఇస్నాపూర్

చైర్ పర్సన్ గా శ్రీమతి మోతే సుమలత ( బి ఆర్ ఎస్ )

వైస్ చైర్ పర్సన్ గా

శ్రీమతి పట్లోళ్ల మాధవి ( కాంగ్రెస్)

జిన్నారం

చైర్మన్ గా నక్కిర్తి యాట జనార్ధన్ ( బిఆర్ఎస్)



వైస్ చైర్మన్ గా వంగెట్టి ప్రతాప్ రెడ్డి ( బిజెపి )

కోహిర్

చైర్మన్గా ఎం. అశోక్ ( కాంగ్రెస్)

వైస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్ ( కాంగ్రెస్)

నారాయణఖేడ్

చైర్మన్గా నగేష్ కుమార్ షట్కార్( కాంగ్రెస్)

వైస్ చైర్మన్ గా దారం శంకర్ ( కాంగ్రెస్)

సదాశివపేట్

మున్సిపల్ చైర్ పర్సన్ గా శ్రీమతి మునిపల్లి అంజమ్మ( కాంగ్రెస్)

వైస్ చైర్మన్ గా శ్రీమతి హెచ్. రేణుక ( కాంగ్రెస్)

సంగారెడ్డి

చైర్ పర్సన్ గా శ్రీమతి కూన వనిత ( కాంగ్రెస్)


వైస్ చైర్మన్ గా షేక్ షఫీ అహ్మద్ ( కాంగ్రెస్) ఎన్నికయ్యారు.

ఇంద్రేశం, జహీరాబాద్ మున్సిపాలిటీలలో కోరం లేకపోవడంతో ఎన్నిక రేపటికి(17.02.2026) వాయిదా పడింది.చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికను పురస్కరించుకొని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించండి: జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా

వైఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 16(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని

అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ వారి తో పాటు డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడువివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి



చెందేలా అర్జీలనుపరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.

పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, ఎంప్లాయిమెంట్ మరియు టూరిజం శాఖ అధికారి సురేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప దైవజనులు బిషప్ సి. హెచ్. జయరాజు

## –సి.ఎఫ్. జి. చర్చ్ – నార్కట్ పల్లి ఘన వీడ్కోలు పలికిన క్రైస్తవులు
## –తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16:

నార్కట్ పల్లి మండల కేంద్రంలో సి. ఎఫ్. జి. చర్చ్ వ్యవస్థాపకులు గొప్ప దైవజనులు సీనియర్ పాస్టర్ బిషప్ సి. హెచ్. జయరాజు ( 62) గత కొంతకాలంగా అనారోగ్యం తో బసవతారక హాస్పిటల్ హైదరాబాద్ చికిత్స పొందుతూ నిన్న మధ్యాహ్నం మృతి చెందిన విషయం ఉమ్మడి నల్గొండ జిల్లాను కలిసివేసిందని వారి ప్రార్థివ దేహానికి పూల మాల వేసి వారి కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్, చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ సూర్యాపేట వ్యవస్థాపకులు బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వారికి భార్య రెచల్ ఇద్దరు కుమార్తెలు వున్నారని వేల మంది ఆత్మీయ బిడ్డలను సంపాదించారాని అన్నారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ పాస్టర్ చింత మనిషే, నల్గొండ జిల్లా కాంగ్రెస్



పార్టీ క్రైస్తవ నాయకులు పోకల అశోక్, సీనియర్ నాయకులు మర్రి రాజు, నకిరేకల్ నియోజకవర్గ పెలోషిప్ పాస్టర్స్ అధ్యక్షులు రెవ. వేముల హనోక్, బిషప్ వై. సమర్పణ కుమార్ జాన్సీ రాణి ,తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షులు బాకీ పరంజ్యోతి,చింత సుధాకర్,పాస్టర్ రావుల అబ్రామ్, పాస్టర్ ఏసురత్నం,పాస్టర్ జిల్లా సంసన్ పాస్టర్ జీవప్రకాష్ బల్లెం, పాస్టర్ నామ మోజెష్, కత్తుల యెహోవా దాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 16: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ప్రతీ రోజూ సాయంత్రం టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుందని భూభారతి, రెవెన్యు సదస్సులు, ప్రజావాణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు పై చర్చించడం జరుగుతుందని తెలిపారు.ప్రజావాణిలో 32 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.

ఈ గ్రీవెన్స్ లో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ పరోక్ష ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్లో కట్టుదిట్టమైన భద్రత: సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ ఫిబ్రవరి 16 (భారత శక్తి):

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేపు (ఫిబ్రవరి 17, మంగళవారం) జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ మరియు మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల పరోక్ష ఎన్నికల కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సర్వం సిద్ధమైంది. ఈ ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా ముగిసేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం తెలిపారు.

మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.నిషేధాజ్ఞలు అమలు: కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇప్పటికే బి.ఎన్.ఎస్.ఎస్ (ఃబొూ) సెక్షన్ 163 (గతంలోని సెక్షన్ 144) కింద నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇవి ఫిబ్రవరి 16 ఉదయం 6 గంటల నుండి ఫిబ్రవరి 17 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఎన్నికలు జరిగే కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, మున్సిపల్ కార్యాలయాల సమీపంలో గుమిగూడటంపై నిషేధం విధించారు. భద్రతా కారణాల దృష్ట్యా మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లే మార్గాల్లో అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, “ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి” అని కోరారు.

==============================

# నిర్మల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు ఏకగ్రీవం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (భారత శక్తి): నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తైంది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నియమించిన అధికారిగా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన 42 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశానికి జనరల్ అబ్జర్వర్ వీరారెడ్డి హాజరయ్యారు. కోరం పూర్తి కావడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు.

చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య ఎన్నికయ్యారు. ప్రతిపాదకుడిగా కత్తి నరేందర్, బలపరిచిన వారిగా ఎం.డి. ఇమాన్ ఉల్లా ఉన్నారు.

వైస్ చైర్‌పర్సన్‌గా అప్పాల గణేష్ చక్రవర్తి ఎన్నికయ్యారు. ప్రతిపాదకుడిగా తాజ్ అద్దీన్, బలపరిచిన వారిగా గొల్లా గోపినాథ్ ఉన్నారు.

ప్రత్యేక అధికారి ఎన్నిక ఫలితాలను అధికారికంగా ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డి.ఈ. హరి భువన్, తాహసిల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## నయినార్ నాగేంద్రన్ విమర్శలు.. స్పందించిన త్రిష




ప్రముఖ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను విమర్శించే క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. విజయ్‌పై ఆరోపణలు చేస్తూ నటి త్రిష ప్రస్తావన తీసుకురావడంతో దుమారం రేగింది. ఈ క్రమంలో త్రిష తరపు న్యాయవాది తాజాగా ప్రకటన విడుదల చేయడం గమనార్హం. ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడతారని ఎవరూ ఊహించలేదన్నారు. సంబంధిత నోట్‌ను త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశారు. తన క్లయింట్ త్రిష సూచనల మేరకు అంటూ నటి అడ్వకేట్, అడ్వైజర్ స్టేట్‌మెంట్ విడుదల చేశారు. ''రాజకీయాల్లో ఉన్నత స్థానంలో ఉన్న ఓ వ్యక్తి ఇలా మాట్లాడతారని నా క్లయింట్ ఊహించలేదు. ఆమెకు రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదు. పొలిటికల్ పార్టీల విషయంలో ఆమె ఎప్పుడూ తటస్థంగానే ఉన్నారు. నటన ద్వారానే తానేంటో నిరూపించుకోవాలని అనుకుంటున్నారు గానీ, ఇలాంటి పొలిటికల్ కామెంట్స్ వల్ల కాదు. సంబంధంలేని విషయాల్లోకి నా క్లయింట్‌ను లాగొద్దు'' అని విజ్ఞప్తి చేశారు.

**ఇంతకీ నాగేంద్రన్ ఏమన్నారంటే...**

'నాలా సొంతగా పార్టీని ప్రారంభించి ఎన్నికల్లో పోటీ చేయగలరా? అని విజయ్ సవాల్ విసిరారు కదా? మీరేమంటారు' అని విలేకరులు నాగేంద్రను అడగ్గా ''పాపం ఆయనకు అనుభవంలేదు. ముందుగా త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు వచ్చి, తన కుటుంబంతో అనుబంధాన్ని కలిగి ఉండాలి'' అంటూ విమర్శించారు.

## సైన్స్ ఫిక్షన్ కథలో?






త్వరలో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేమికులుగా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతున్నారు అందాల తార రష్మిక, బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్. ఈ సినిమాతో పాటు వీరిద్దరూ జంటగా మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా దీని గురించి మరో ఆసక్తికర వార్త నెట్టింట్లో సందడి చేస్తుంది. ఇంకా పేరు ఖరారు కానీ ఈ ప్రాజెక్టులో రష్మిక, షాహిద్ భార్యాభర్తలుగా కనిపించనున్నారని, సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రొమాంటిక్ కామెడీ డ్రామాగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు 'మైదాన్' ఫేమ్ అమిత్ శర్మ దర్శకత్వం వహించనున్నారని, ఈ ఏడాది ఆగస్టులో చిత్రీకరణను మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం రష్మిక ఖాతాలో 'మైసా' సినిమా ఉంది.

## ఆరోజు చిరంజీవి చేసిన సాయం చాలా గొప్పది

**: సాయికుమార్**


తెలుగు సినీ పరిశ్రమలోకి ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎంట్రీ ఇచ్చి మెగాస్టార్ స్థాయికి ఎదిగారు చిరంజీవి. ఎంతో మందికి ఆయన ప్రస్థానం ఓ స్ఫూర్తిదాయకం. అంతేకాదు, యువ ప్రతిభను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నటుడు సాయికుమార్ మాట్లాడుతూ... చిరంజీవి గొప్పదనాన్ని ప్రశంసించారు. అప్పట్లో పవన్ కల్యాణ్ మొదటి సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' రిలీజ్‌కు సిద్ధంగా ఉండగా... సాయికుమార్ హీరోగా నటించిన చిత్రం 'పోలీస్ స్టోరీ' తెలుగులో డబ్ అయ్యి రిలీజ్ కావాల్సి ఉంది. సాయికుమార్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానే గుర్తింపు పొందారు కాబట్టి, తెలుగులో హీరోగా మార్కెట్ లేదని భావించారు. దీంతో, మీరు ఈ సినిమాను ప్రమోట్ చేస్తే బాగుంటుందని చిరంజీవిని అడిగారు. అయితే, తమ విన్నపాన్ని తొలుత చిరంజీవి సున్నితంగా తిరస్కరించారని సాయికుమార్ తెలిపారు. తాను బాగుందని చెబితే సినిమాకు ప్రేక్షకులు వస్తారని... కానీ, సినిమా బాగోకపోతే తనను తిట్టుకుంటారని చిరంజీవి అన్నారని చెప్పారు. కానీ, తాను పట్టుబట్టడంతో చిరంజీవి సినిమా చూశారని... ఆ తర్వాత తన నటనను అభినందించడమే కాకుండా... ప్రమోషన్ కోసం ఒక వీడియో కూడా చేశారని తెలిపారు.

## ప్రభాస్‌కు గాయం



రెబెల్ స్టార్ ప్రభాస్ గాయపడ్డారని సమాచారం. ఆయన తాజాగా నటిస్తోన్న ఫౌజీ మూవీ షూటింగ్‌లో ప్రమాదం జరిగింది. హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలోని ఓ కీలక సన్నివేశం కోసం గుర్రపు స్వారీ చేస్తుండగా హీరో కింద పడటంతో చేతికి గాయమైనట్లు సోషల్ మీడియాలో వార్త వైరల్ అవుతోంది. ఈ గాయం చిన్నదేనని సినీ వర్గాల నుంచి సమాచారం అందుతుండగా అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ దసరా సందర్భంగా విడుదల కానుంది. దీంతో విరామం లేకుండా షూటింగ్ పూర్తి చేసి సినిమాని తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం ఇటీవల పేర్కొంది. ఇందులో డార్లింగ్ సరసన ఇమాన్వీ నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## నో వెయిటింగ్







టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ పెండ్లి వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. వీరిద్దరూ గతేడాదే రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారని, ఈనెల 26న రష్మిక, విజయ్ దేవరకొండ పెండ్లి చేసుకోనున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలోనే నిన్న రాత్రి వీరిద్దరూ వేర్వేరుగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో కనిపించడం ఈ పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. ఇక 26వ తేదీ కోసం వెయిట్ చేస్తున్నామని ఓ కెమెరామెన్ విమానాశ్రయంలో విజయ్ తో అన్నాడు. అందుకు విజయ్ 'వెయిటింగ్ ఎందుకు? ఎలాగైనా వస్తుంది కదా 26 డేట్' అని రిప్లై ఇచ్చాడు. పెండ్లి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించేందుకే వారు ముందుగానే జైపూర్‌కు బయలు దేరినట్లు సమాచారం. అయితే, ఈ వివాహ వార్తలపై అటు విజయ్ కానీ, ఇటు రష్మిక కానీ ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక ఒకవైపు వ్యక్తిగత జీవితం గురించి ఇన్ని వార్తలు వస్తుండగా, వృత్తిపరంగా కూడా ఈ క్రేజీ కాంబినేషన్ మళ్లీ సందడి చేయనుంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో వీరిద్దరూ జంటగా నటిస్తున్నారు.

## మానసికంగా కుంగిపోయా




యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ యమదొంగ మూవీతో టాలీవుడ్‌లో క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ మమతా మోహన్ దాస్. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉండగానే క్యాన్సర్ బారిన పడింది. దాదాపు రెండుసార్లు క్యాన్సర్ తో పోరాడి గెలిచింది. చాలా ఏండ్ల తర్వాత మహారాజా మూవీతో ప్రేక్షకులను పలకరించింది. విజయ్ సేతుపతి హీరోగా వచ్చిన ఈ సినిమాలో కీలక పాత్రలో మెప్పించింది. అంతేకాకుండా ఇటీవలు రుద్రాంగి సినిమాతో టాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇచ్చింది ఈముద్దుగుమ్మ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితంలో జరిగిన ఘటనపై ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఒక స్టార్ యాక్టర్ తనను ఎలా మోసం చేశాడని తెలిపింది. క్యాన్సర్, బొల్లి వ్యాధి సమస్యలతో సమస్యలతో పోరాడుతున్న సమయంలోనే ప్రేమ, పెండ్లి విషయంలోనూ ఎంతో మానసిక వేదనను అనుభవించానని అంటోంది. 'నాకు డేటింగ్, ప్రేమలో పెద్దగా అనుభవం లేదు. క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత, ఒక మహిళగా నా అంచనాలను నెరవేర్చుకోవాలనుకున్న. ఆ సమయంలో ఒక ప్రముఖ మలయాళ నటుడు నన్ను డేటింగ్ కోసం అడిగాడు. అందుకు నా తల్లి సైతం నాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అతడికి అప్పటికే వేరే మహిళతో నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని నా దగ్గర దాచి పెట్టాడు. అసలు విషయం తెలిసి షాకయ్యాను. తర్వాత నా జీవితంలో మరో వ్యక్తిని కలుసుకున్నాను. కానీ ఈ ప్రేమ, డేటింగ్ అనవసరమని అన్నాడు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు పెండ్లి బంధంలో విడాకులు నన్ను మానసికంగా కుంగదీశాయి' అంటూ మమతా చెప్పుకొచ్చింది.

## ప్రియాంక చోప్రాను చూసి దేశం గర్విస్తోంది: శశిథరూర్

నటి ప్రియాంక చోప్రాను చూసి దేశం గర్విస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్ 2026లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శశిథరూర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ప్రియాంకపై ఆయన ప్రశంసలు కురిపించారు. ''ప్రియాంక ఏ పని చేసినా హుందాగా చేస్తారు. భారతీయులు అరుదుగా కనిపించే అంతర్జాతీయ వేదికపై ఆమె ఉండడం చూసి దేశం మొత్తం గర్విస్తోంది. వేదికపై ఆమె మాటలు కూడా అందరినీ ఆలోచింపచేసేలా ఉంటాయి. ఇంతకంటే గర్వకారణం ఇంకేం ఉంటుంది'' అని శశిథరూర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌ను రీషేర్ చేసిన ప్రియాంక ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. 'మీ నుంచి ప్రశంసలు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. మీరు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను' అని రిప్లై పెట్టారు. ఫిబ్రవరి 4న ప్రమాదవశాత్తూ ఆయన కిందపడిన విషయం తెలిసిందే. కాలుకు ఉన్న కట్టుతోనే వీల్‌ఛైర్‌లో పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు. ప్రస్తుతం ప్రియాంక చోప్రా 'వారణాసి'లో నటిస్తున్నారు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో ఆమె మందాకిని పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా విడుదల కానుంది.





# సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత




* **వైస్ చైర్మన్ గా ఎండి షఫీ ఉల్లా ఎన్నిక ఏకగ్రీవం**

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 16: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట మున్సిపాలిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్నిక అధికారి సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, సహాయ ఎన్నిక అధికారి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూతనంగా కౌన్సిలర్ గా ఎంపికైన గౌరవ సభ్యులు ఉదయం 10 :45 నిమిషములకు మీటింగ్ హాలుకు హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ రిజిస్టర్ లో ఎన్నికలలో విజయం సాధించిన 48 మంది గౌరవసభ్యుల పేర్లను నమోదు చేసుకుని, సంతకాలు సేకరించారు. అనంతరం 48 మంది సభ్యుల చేత ముందుగా సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎన్నిక అధికారులు వారికి శుభాభినందనలు తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైన ర్ చే చైర్మన్ ఎన్నిక, వైస్ చైర్మన్ ఎంపికపై నూతనంగా ఎంపికైన కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. అనంతరం 12:30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు .చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత (46 వ వార్డు) పేరును గుణగంటి హేమ (44వ వార్డు) సభ్యురాలు ప్రపోజ్ చేశారు. వీరికి 31మంది కాంగ్రెస్ సభ్యులు. ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ గా మహమ్మద్ షఫీ ఉల్లా (41వ వార్డు ) పేరును నాగుల శ్రీనివాస్ (33వ వార్డు) నామ అరుణ(30వ వార్డు) లు ప్రపోజ్ చేశారు, వీరికి 31 మంది కాంగ్రెస్ సభ్యులు ముగ్గురి ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు.దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఎక గ్రీవమైనది. అనంతరం చైర్మన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ మహ్మద్ షఫీ ఉల్లా లకు, ఎన్నిక అధికారులు ఆర్డీఓ వేణుమాధవరావు సహాయ ఎన్నిక అధికారి సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి లు పుష్పగుచ్చాలను అందించి, శాలువాలతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రేయిని రమేష్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భైంసా మున్సిపాలిటీలో నూతన చైర్మన్–వైస్ చైర్మన్ ఎన్నికలకు జిల్లా ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణ

* **రాజ్యాంగబద్ధ ప్రక్రియకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత: జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (భారత శక్తి): నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలో సోమవారం ప్రమాణస్వీకారాలు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో *జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల భైంసా మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో గెలుపొందిన వారందరూ సోమవారం ప్రమాణస్వీకారం చేయనుండగా, అనంతరం చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడనుంది. ఈ పక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంతంగా సాగేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు అమలు చేయబడ్డాయి. ఇదే విధంగా జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో కూడా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు *జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల* తెలిపారు. ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా రాజ్యాంగబద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించినట్లే, అభ్యర్థులు కూడా ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు జిల్లా ఎస్పీ *డా. జి.జానకి షర్మిల. స్పష్టం చేశారు.మున్సిపల్ చైర్మన్-వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తుందని తెలిపారు.

బాసరలో ఘనంగా ప్రారంభమైన

# ‘3డీ ప్రింటింగ్ & డిజైన్’ ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (భారత శక్తి): బాసర ఆర్జీయుకేటిలో నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ సహకారంతో “3డీ ప్రింటింగ్ మరియు డిజైన్” అనే అంశంపై వారం రోజుల పాటు జరిగే ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఈరోజు వైభవంగా ప్రారంభమైంది. అధ్యాపకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

* **సాంకేతిక విప్లవానికి 3డీ ప్రింటింగ్ నాంది: వైస్ ఛాన్సలర్**

కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఏ.గోవర్ధన్ మాట్లాడుతూ, “నేటి పారిశ్రామిక యుగంలో 3డీ ప్రింటింగ్ (అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్) ఒక గేమ్ ఛేంజర్. కేవలం పరిశ్రమలకే కాకుండా వైద్యం, ఏరోస్పేస్, నిర్మాణ సంస్థలు మొదలైన రంగాలలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. మన అధ్యాపకులు ఈ సాంకేతికతలో నైపుణ్యం సాధించి, విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలి” అని పిలుపునిచ్చారు.

* **పరిశ్రమ - విద్యాసంస్థల అనుసంధానం అవసరం: పరిపాలనాధికారి**



విశ్వవిద్యాలయ పరిపాలనాధికారి ప్రొ. ఇ. మురళీ దర్శన్ మాట్లాడుతూ, ఎన్.సి.ఎ.ఎం. వంటి జాతీయ స్థాయి సంస్థలతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా ల్యాబ్ నాలెడ్జ్ కాస్తా ప్రాక్టికల్ అప్లికేషన్‌గా మారుతుందని, ఇది విద్యార్థుల ప్లేస్‌మెంట్లకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రతినిధులు, నిపుణులు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రొ.ఎల్. శివరామకృష్ణ మాట్లాడుతూ, “ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఈ వారం రోజుల శిక్షణలో డిజైన్ సాఫ్ట్‌వేర్, మెటీరియల్ సైన్స్ మరియు 3డీ ప్రింటర్‌ల పనితీరుపై లోతైన శిక్షణ ఇస్తాం. కేవలం థియరీ మాత్రమే కాకుండా హ్యాండ్స్‌ఆన్ ఎక్స్‌పీరియన్స్ అందించడమే మా లక్ష్యం” అని వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్.సి.ఎ.ఎం. స్కిల్లింగ్ & ఇంక్యూబేషన్ మేనేజర్ డాక్టర్ జి. శ్వేత మాట్లాడుతూ, “అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ అనేది కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాదు, అది ఒక పారిశ్రామిక విప్లవం. అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా విద్యార్థులలో నూతన ఆవిష్కరణలకు బాటలు వేయవచ్చు. ఈ శిక్షణలో భాగంగా డిజైన్ నుండి ప్రింటింగ్ వరకు ప్రతి దశలోనూ నైపుణ్యం సాధించేలా ఫాకల్టీకి శిక్షణ ఇస్తాం. పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేయడమే మా లక్ష్యం” అని వివరించారు. ఈ కార్యక్రమంలో సింప్లి ఫోర్జ్ క్రియేషన్ హె.డ్ డా. హనుమాన్ నాయక్, మెకానికల్ విభాగాధిపతి చరణ్ రెడ్డి, కోఆర్డినేటర్ డా.పి.వి.చంద్రశేఖరరావు, కోకోఆర్డినేటర్ డా. జి.నాగరాజు, అసోసియేట్ డీన్లు డా. ఎస్. విఠల్, ఎస్. శేఖర్, డా.కె. మహేశ్, అధ్యాపకులు కె. శ్రీదేవి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భైంసా పురపాలక సంఘానికి నూతన చైర్‌పర్సన్ తుమ్మోల్ల దత్తాత్రి, వైస్ చైర్‌పర్సన్ బీబీ కుతిజ సిద్ధికా ఎన్నిక

* **ఎంఐఎం ఆధిపత్యానికి ముగింపు – స్వతంత్రులకు బీజేపీ, కాంగ్రెస్ మద్దతు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (భారత శక్తి) : నిర్మల్ జిల్లాలోని భైంసా పురపాలక సంఘంలో సోమవారం నిర్వహించిన పరోక్ష ఎన్నికల్లో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్మల్ ఆర్డీఓ రత్న కళ్యాణి, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్‌గా స్వతంత్ర అభ్యర్థి తూము దత్తాత్రి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, వైస్ చైర్‌పర్సన్‌గా బీబీ కుతిజ సిద్ధికా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఎన్నికల అనంతరం కౌన్సిలర్లు, అధికారులు నూతనంగా ఎన్నికైన నాయకులను అభినందించారు. పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని చైర్‌పర్సన్ దత్తాత్రి, వైస్ చైర్‌పర్సన్ బీబీ కుతిజ సిద్ధికా పేర్కొన్నారు.

* **ఎంఐఎం కంచుకోటకు చెక్***



గత నాలుగు దశాబ్దాలుగా ఎంఐఎం ఆధిపత్యం కొనసాగిన భైంసా మున్సిపాలిటీలో ఈసారి రాజకీయ సమీకరణాలు మారాయి. తాజా ఫలితాల్లో ఎంఐఎం 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 6, కాంగ్రెస్ 1, స్వతంత్రులు 7 స్థానాలు సాధించారు. బీజేపీ, కాంగ్రెస్ మద్దతుతో పాటు ఎమ్మెల్యే ఎక్స్‌అఫిషియో ఓటు సహకారంతో స్వతంత్ర కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పీఠాలను కైవసం చేసుకున్నారు.

**హిందూ–ముస్లిం ఐక్యత నినాదాలు***

స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన అనంతరం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం “హిందూ-ముస్లిం భాయ్ భాయ్” నినాదాలతో మార్మోగింది. భైంసా ఇకపై సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వైస్ చైర్‌పర్సన్ భర్త మిర్జా ఇద్రిస్ బేక్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇళ్ల అనుమతుల కోసం అనవసర రుసుములు లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్ గూండాగిరి: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (భారత శక్తి) : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గూండాగిరి చేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కిడ్నాప్‌లు, దాడులు, అక్రమ ఓట్లతో పదవులు పొందిందని ఆరోపించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు ఇవాళ్టి పరిణామాలే నిదర్శనమన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ‘‘ఎక్స్ అఫీషియో ఓట్ల పేరుతో దొంగ ఓట్లను నమోదు చేశారు. కాంగ్రెస్ తొత్తులుగా మారిన పోలీసులపై డీజీపీ చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ నేతల ఒత్తిడి మేరకు ఛైర్‌పర్సన్ల ఎన్నికను కొన్ని చోట్ల వాయిదా



వేశారు. సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి’’ అని కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు హంగ్ వచ్చిన మున్సిపాలిటీలపై భారాస దృష్టి సారించింది. 8 పట్టణాలకు సీనియర్ నేతలను ఇన్‌ఛార్జిలుగా నియమించింది.

# ఉన్నత విద్య కోసం మరో ఆరు దేశాలకు భారత విద్యార్థులు

**ఉన్నత చదువుల కోసం అమెరికా, కెనడా వెళ్లడం ఆనవాయితీ. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులకు అనేక ఆప్షన్లు ఉన్నాయి. కొందరు జర్మనీలో ఇంజినీరింగ్, రోటర్ డామ్‌లో ఎంబీఏ, మరికొందరు హంగేరీలో ఎకనామిక్స్ లేదా న్యూజిలాండ్‌లో క్రియేటివ్ ఆర్ట్స్‌ను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం విదేశాల్లో 13.2 లక్షల మంది భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వీరిలో 4.6 లక్షల మంది అమెరికాలో, 1.83 లక్షల మంది కెనడాలో ఉన్నారని ప్రపంచ బ్యాంకు డేటా చెబుతోంది.**

▸▸ ఇటీవలి కాలంలో అమెరికాలో భారతీయ విద్యార్థులపై దాడులు పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ తేలికపాటి మాంద్యం నుంచి కోలుకోవడానికి యూకే ఆర్థిక వ్యవస్థ ఇంకా కష్ట పడుతున్నది. అమెరికా, యూకే, కెనడా వంటి సంప్రదాయ అధ్యయన గమ్యస్థానాలను భారతీయ విద్యార్థులు పునఃసమీక్షించాల్సిన సమయం ఇది.

**జర్మనీ**

▸▸ జర్మనీలో మొత్తం 423 ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో 108 విశ్వవిద్యాలయాలు, 211 అప్లైడ్ సైన్సెస్ విశ్వవిద్యాలయాలు, 52 కళలు, సంగీత కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి 42,997 మంది విద్యార్థులు జర్మనీలో విద్యనభ్యసిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థుల్లో ప్రాచుర్యం పొందిన కోర్సులు ఇంజినీరింగ్, లా మేనేజ్‌మెంట్, గణితం. జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్ డేటా ప్రకారం, జర్మనీలో భారతీయ విద్యార్థుల సంఖ్య గత ఐదేళ్లలో రెట్టింపు అయింది. ఇది జర్మన్ క్యాంపస్‌లలో అతిపెద్ద అంతర్జాతీయ సమాజంగా మారింది.

**నెదర్లాండ్స్**

▸▸ నెదర్లాండ్స్‌లో 30 కంటే ఎక్కువ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉన్నాయి. వాటిలో ఎక్కువ భాగం ఆమ్‌స్టర్‌డామ్, రోటర్‌డామ్, గ్రోనింగెన్, డెల్ఫ్ట్‌లలో ఉన్నాయి. నెదర్లాండ్స్‌లోని భారత రాయబార కార్యాలయం లెక్కల ప్రకారం ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో 3,500 మందికి పైగా భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో 1,15,000 మంది అంతర్జాతీయ విద్యార్థులు ఉన్నారు. ఇది 2005 నాటికి దేశంలో ఉన్న సంఖ్యకు 3.5 రెట్లు. విశ్వవిద్యాలయాల్లో మొదటి సంవత్సరం విద్యార్థుల్లో సుమారు 40 శాతం మంది ప్రస్తుతం నెదర్లాండ్స్ వెలుపల నుంచి వస్తున్నారు.

**పోలాండ్**

▸▸ పోలాండ్‌లో దాదాపు 457 విశ్వవిద్యాలయాలు, కళాశాల స్థాయి ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. పోలాండ్‌లో టర్కీ విద్యార్థుల తరువాత రెండో స్థానంలో సుమారు 2,500 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.



**హంగేరి**

▸▸ హంగేరీలో మొత్తం 65 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో అనేకం బుడాపెస్ట్ కేంద్రంగా ఉన్నాయి. వీటిలో బుడాపెస్ట్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎకనామిక్స్, సెంట్రల్ యూరోపియన్ యూనివర్సిటీ, ఈఎస్సీఏ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) విడుదల చేసిన 2022 గణాంకాల ప్రకారం హంగేరియన్ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1,000 మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారు.

**బెల్జియం**

▸▸ బెల్జియం ఐరోపాలోని కొన్ని పురాతన, అత్యంత ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలను కలిగి ఉంది. ముఖ్యంగా కాథోలిక్ యూనివర్సిటీ ఆఫ్ ల్యూవెన్, యూనివర్సిటీ ఆఫ్ ఘెంట్, యూనివర్సిటీ లిబ్రే డి బ్రూక్సెల్స్, వ్రిజే యూనివర్సిటీ బ్రసెల్, బ్రస్సెల్స్, ఆంట్వెర్ప్ విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఎక్కువ మంది భారతీయ విద్యార్థులు బెల్జియంలో ఉండగా, కొందరు లక్సెంబర్గ్‌లో కూడా ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం బెల్జియంలో 24,732 మంది ప్రవాస భారతీయులు ఉన్నారు.

**న్యూజిలాండ్**

▸▸ న్యూజిలాండ్‌లో ఎనిమిది విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఆక్లాండ్ విశ్వవిద్యాలయం అత్యున్నత ర్యాంక్ పొందిన ప్రపంచ విశ్వవిద్యాలయం. చాలా మంది భారతీయ విద్యార్థులు ఎంబీఏ చేయడానికి లేదా అకడమిక్ రీసెర్చ్ కోసం న్యూజిలాండ్ వెళతారు. చైనా తర్వాత రెండో స్థానంలో ఉన్న ఈ ద్వీపదేశంలో దాదాపు 15,000 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

* **తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో బుర్రకథ కళాకారులతో ప్రదర్శన**

ఎల్బీనగర్, ఫిబ్రవరి 16 (భారత శక్తి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా మెలిగినప్పుడే ఆర్థిక మోసాలకు గురికాకుండా తమ కష్టార్జిత ధనాన్ని కాపాడుకోగలుగుతారని నాగోల్ పోలీస్ స్టేషన్ సిఐ మహమ్మద్ మక్బూల్ జానీ స్పష్టం చేశారు.సోమవారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో గల తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై బుర్ర కథ కళాకారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, సైబర్ మోసాల పద్ధతులు కూడా విస్తరిస్తున్నాయని తెలిపారు. ఫోన్ కాల్స్, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, ఓటీపీలు, ఫేక్ లింకులు, యూపీఐ రిక్వెస్ట్‌లు, సోషల్ మీడియా మోసాల ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించారు.ఎవరితోనూ ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్లు వంటి వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు పంచుకోకూడదని సూచించారు.అనుమానాస్పద మెసేజ్‌లు, లింకులు, రివార్డు ఆఫర్లు, లోన్ ఆఫర్లు వంటి వాటిని నమ్మవద్దని, ఎటువంటి లావాదేవీ చేయడానికి ముందు ధృవీకరించుకోవాలని తెలిపారు. మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తక్షణ చర్యల ద్వారా డబ్బు రికవరీకి అవకాశం ఉంటుందని వివరించారు.ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక సాక్షరతపై కూడా అవగాహన కల్పించారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు, యూపీఐ వినియోగం, పాస్‌వర్డ్ భద్రత, సోషల్ మీడియా జాగ్రత్తలు వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు.సమాజంలో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రజలకు ఉపయోగకరంగా నిలిచింది. డిజిటల్ యుగంలో జాగ్రత్తే రక్షణ అన్న సందేశం ఖాతాదారులకు ఉపయోగపడింది.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజలక్ష్మి, సిబ్బంది మమత, శశిధర్, ఫణి కుమార్, శోభ బ్యాంకు ఖాతాదారులు, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ 25వ వార్డు కౌన్సిలర్ గా
# సి.పెంటయ్య ప్రమాణ స్వీకారం

రంగారెడ్డి జిల్లా , ఫిబ్రవరి 16 (భారత శక్తి): షాద్ నగర్ మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ గా సి.పెంటయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పదవీ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన 25వ వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.వార్డు అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.ప్రమాణ స్వీకారకార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ కమిషనర్ సునీత,పార్టీ నాయకులు, కార్యకర్తలు,



అభిమానులు మరియు స్థానికులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

# పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**: జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి జిల్లా , ఫిబ్రవరి 16 (భారత శక్తి): జిల్లాలో మార్చి-2026లో నిర్వహించబడనున్న పబ్లిక్ పరీక్షలు 14 మార్చి నుండి 16 ఎప్రిల్ వరకు ప్రతిరోజు ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి అధికారులతో సోమవారం మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్షల సందర్భంగా తీసుకోవలసిన ముఖ్యమైన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన ప్రశ్నాపత్రాల రక్షణ కోసం 24 గంటలూ 14 సాయుధ గార్డులు నియమించాలని, ఐదు రూట్లలో ప్రశ్నాపత్రాల పంపిణీకి సాయుధ గార్డుల బృందాలు ఏర్పాటు చేయబడతాయన్నారు.

జిల్లాలోని 65 పరీక్షా కేంద్రాలలో పోలీసు బందోబస్తుతో పాటు పరీక్షా సమయాల్లో (ఉ. 8:00 నుండి మ. 1:00 వరకు) కేంద్రాల పరిసర ప్రాంతాలలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ విధుల కోసం ముగ్గురు పోలీసు అధికారులు నియమించాలని అన్నారు. డిఈఓ కార్యాలయంలో పోలీస్ వైర్‌లెస్ సెట్ ఏర్పాటు చేయాలని



**రెవెన్యూ శాఖ చర్యలు**

పరీక్షా రోజులలో ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో U/S 163 BNSS (U/S 144 Cr.P.C) అమలు చేయబడుతుందన్నారు. 'సి' కేటగిరీ కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌లుగా 12 మంది రెవెన్యూ అధికారులను నియమించడం జరుగుతుందని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారులను నియమించాలని,

**ట్రెజరీ శాఖ**

పరీక్షల నిర్వహణకు సంబంధించిన బిల్లులు సకాలంలో ఆమోదించాలని, గోప్యమైన సామగ్రి భద్రపరచేందుకు ఐడిఓసి ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌ను వినియోగించాలని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం నుండి రహస్య సామగ్రి స్వీకరణకు జాయింట్ కస్టోడియన్‌ను నియమిస్తారు.

**రవాణా సదుపాయాలు**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా పరీక్షా తేదీలలో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, గ్రామాల నుండి కేంద్రాలకు ఉదయం 8:00 గంటల లోపు , మధ్యాహ్నం 1:00 గంటల తర్వాత ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉండాలని, సంబంధిత పోస్టాఫీసుల నుండి జిల్లా కేంద్రానికి ఎస్ ఎస్ సి పార్శిల్స్ రవాణా కు అవసరమైన బస్సు సౌకర్యం కల్పించాలని

**విద్యుత్ సరఫరా**

పరీక్షా కాలంలో ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని , వైద్య సదుపాయాలు ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్ , అవసరమైన మందులతో పాటు ఏ ఎన్ ఎమ్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. పోస్టల్ శాఖ ఎస్ ఎస్ సి పరీక్షా మెటీరియల్ పార్శిల్స్‌ను సాయంత్రం 4:00 గంటల వరకు స్వీకరించేలా సూచనలు జారీ చేయాలని, గోప్యమైన వస్తువులు పోస్టల్ మార్గదర్శకాల ప్రకారం సురక్షితంగా సీల్డ్ కవర్లలో పంపిణీ చేయాలని, జిల్లాలో ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డిఈఓ రాజు, ఇంటర్మీడియట్ అధికారి , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో బద్దలైన మజ్లిస్ కోట

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (భారత శక్తి): నిర్మల్ జిల్లాలోని భైంసా మున్సిపాలిటీలో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న మజ్లిస్ ఆధిపత్యానికి తాజా ఎన్నికలు బ్రేక్ వేశాయి. గత 20 ఏళ్లుగా మున్సిపల్ ఛైర్మన్ పీఠం (ఎంఐఎం) చేతుల్లోనే ఉండగా, ఈసారి రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. మొత్తం 26 వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం 12 స్థానాలు గెలుచుకుంది. (బీజేపీ) 6 వార్డులు, (కాంగ్రెస్) 1 వార్డు, స్వతంత్ర అభ్యర్థులు 7 వార్డుల్లో విజయం సాధించారు. ఫలితాల అనంతరం మరోసారి ఎంఐఎం ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటుందని రాజకీయ వర్గాలు భావించాయి. అయితే, అనూహ్యంగా బీజేపీ స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం రాజకీయ సమీకరణాలను మార్చింది. దీంతో ఇండిపెండెంట్లు మెజారిటీ సాధించి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్నారు.




ఛైర్మన్‌గా దత్తాత్రి (బీజేపీ రెబల్), వైస్ ఛైర్మన్‌గా ఖతీజా బేగం (స్వతంత్ర)ఎన్నికయ్యారు. ఈ పరిణామంతో భైంసా మున్సిపాలిటీలో మజ్లిస్ కోట బద్దలైనట్టైంది. స్థానిక రాజకీయాల్లో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకోగా, భవిష్యత్‌లో పట్టణ అభివృద్ధి, పాలనలో మార్పులు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

## దళితులను రక్షించేందుకు
# జాతీయ ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది

* **కర్ల రాజేష్ హత్య కేసుపై అధికారులపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడువిచారణ**



సూర్యాపేట, ఫిబ్రవరి 16 (భారత శక్తి): దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు.సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాక్ ఆఫ్ డెత్ కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ నుండి మంజూరైన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అడిషనల్ డీజీ చౌహాన్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సమక్షంలో రాజేష్ తల్లి లలితమ్మకు అందజేశారు.అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమీషన్ సభ్యులు మాట్లాడుతూ, కర్ల రాజేష్ కేసు పత్రికల్లో చూసి జాతీయ ఎస్సీ కమిషన్ సుమోటో కింద కేసు నమోదు చేసిందన్నారు. కమిషన్ కేసులో ప్రవేశించిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేష్ మృతి పై నేటి వరకు చార్జీ సీటు ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చార్జీషీట్ కు సమయం కోరారని కాగా కమిషన్ చార్జిషీటు వెంటనే దాఖలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కేసులో బాధ్యులైన సిఐపై చర్య తీసుకోవడమే కాక, ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీలని ఆదేశించారు. పది రోజుల్లో రీ పోస్టుమార్టం చేసి నివేదికను అందించాలని ఆదేశించారు.1989 జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు జవాబు ఇవ్వకపోతే నిర్లక్ష్యపు యాక్ట్ ప్రకారం సస్పెన్షన్ తో పాటు ఆరు నెలలు జైలు ఉంటుందని హెచ్చరించారు.రాజేష్ తల్లికి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని, మూడు రోజుల్లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, వ్యవసాయ భూమి ఇచ్చేందుకు కలెక్టర్ తగు చర్యలు తీసుకో వలసినదిగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వారి వెంట అడిషనల్ డిజి డివిస్ చౌహన్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తదితరులు పాల్గొన్నారు.



## సంగారెడ్డిలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగీత విభావరి

* **పట్టణ వాసులను అలరించిన జాగరణ కార్యక్రమాలు**

సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (భారత శక్తి): సంగారెడ్డి పట్టణంలో మహా శివరాత్రి వేడుకలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. గంజ్ మైదానంలో నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. వీణా వాణి ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వందేమాతరం శ్రీనివాస్, మనో, పార్థసారథి, ప్రవీణ్, కల్పన, కౌసల్య తదితర సినీ నేపథ్య గాయకులు తమ పాటలతో మైమ రిపించారు.

* **మహా శివరాత్రి వేడుకల్లో.. జగ్గారెడ్డి**

మహాశివరాత్రిని పురస్కరించుకొని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న సంగమేశ్వర దేవాలయంలో జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు ని ర్వహించారు. స్వయంగా పాటలు పాడుతూ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పసల్వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠాన్ని సందర్శించారు. జల లింగానికి అభిషేకం నిర్వ హించారు. ఈ కార్యక్రమాల్లో జగ్గారెడ్డి తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

* **7 గంటల పాటు..సంగీత విభావరి జాగరణ కార్యక్రమం**

ఏటా మాదిరిగానే ఈసారి కూడా గంజ్ మైదానంలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దాదాపు 12 మందికి పైగా సినీ నేపథ్య గాయకులు పాల్గొన్నారు. భక్తి పాటలు పాడుతూ అందరినీ అలరించారు. రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 3 అంటే..దాదాపు 7 గంటల పాటు సంగీత విభవరి జాగరణ కార్యక్రమం పట్టణ వాసులను భక్తులను విశేషంగా అలరించింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు పట్టణ ప్రజలు వేలాది భక్తులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో కుమారస్వామికి పీహెచ్డీ

సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (భారత శక్తి): హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సాదినేని కుమార స్వామి డాక్టరేట్ కు అర్హత సాధించారు. '1,2,3 ట్రయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, ఔషధ మూల్యాంకనం, ఇన్‌సిలికో డాకింగ్ అధ్యయనాలు' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు హరిదాస్యం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. కుమారస్వామి చేసిన డాక్టోరల్ పరిశోధన, ఆశాజనకమైన యాంటీమైక్రోబయల్, క్యాన్సర్ నిరోధక సామర్థ్యంతో కూడిన నూతన ట్రయాజోల్ ఆధారిత టెట్రాజోల్, ఇమిడాజోల్ ఉత్పన్నాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఔషధ రసాయన శాస్త్రంలో కొత్త చికిత్సా అభ్యర్థులను అన్వేషించడానికి ఆయన అధ్యయనం అధునాతన డిజైన్, సంశ్లేషణ, ఔషధ పోలిక విశ్లేషణ, ఫార్మాకోఫోర్ మోడలింగ్, మాలిక్యులర్ డాకింగ్ పద్ధతులను ఏకీకృతం చేస్తుందని వివరించారు.కుమారస్వామి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విజయం ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించే అధికప్రభావ శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలకు గీతం యొక్క నిరంతర నిబద్ధతను చాటిచెబుతోందన్నారు. గీతం యొక్క విద్యా నైపుణ్యం, పరిశోధన కార్యక్రమాలకు హైదరాబాదు ఒక శక్తివంతమైన కేంద్రంగా కొనసాగుతోందని తెలిపారు.



# భాగ్యనగరంలో శివనామస్మరణ: ఎన్టీఆర్ స్టేడియంలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (భారత శక్తి) : 'ఓం నమశ్శివాయ'.. 'శంభో.. స్వయంభూ' నామస్మరణతో భాగ్యనగరం మారుమోగింది. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 50 వేల మందికి పైగా భక్తులు పాల్గొని శివారాధనలో తన్మయత్వం చెందారు.

* **కన్నుల పండుగగా పంచభూత శాంతి అభిషేకాలు**

లోక కల్యాణం కోసం నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా పంచభూత శాంతి అభిషేకాలు, జపం, ధ్యానం, మరియు సామూహిక జాగరణ కార్యక్రమాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ ఉచితంగా రుద్రాక్షలు, విభూతి మరియు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.





* **ప్రకృతి ఆరాధనే పరమాత్ముని సేవ: శ్రీకృష్ణ చాముండేశ్వరి**

ఈ సందర్భంగా విశ్వశాంతి ఉపాసకులు శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వశాంతి: పంచభూతాల సమతుల్యత దెబ్బతినడం వల్లే మానవాళి అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, ప్రకృతిని ఆరాధించడం ద్వారానే విశ్వశాంతి సాధ్యమని పేర్కొన్నారు.

* పర్యావరణ పరిరక్షణ: అణువణువునా కొలువై ఉన్న పరమశివుడిని ప్రకృతి రూపంలో దర్శించి, కాలుష్య రహిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.
* గంగాజల సంప్రోక్షణ: హిమాలయాల నుంచి తెప్పించిన పవిత్ర గంగాజలాలను భక్తులపై ప్రోక్షణం చేయడం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**తరలివచ్చిన ప్రముఖులు**

రాజకీయాలకు అతీతంగా సాగిన ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీలు ఆర్. కృష్ణయ్య, బలరాం నాయక్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఇందులో పాల్గొన్నారు. వీరితో పాటు సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, శ్రీశైలం గౌడ్, చిన్న శ్రీశైలం యాదవ్, ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్. భద్ర తదితర అధికారులు, సామాజిక కార్యకర్తలు ఈ శివరాత్రి జాగరణలో పాలుపంచుకున్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన భక్తులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. క్రమశిక్షణతో సాగిన ఈ సామూహిక ప్రార్థనలు ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లాయి. భవిష్యత్తులోనూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రభుత్వాలు, భక్తుల సహకారంతో కొనసాగిస్తామని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి పీఠం ప్రతినిధులు వెల్లడించారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

* **పెండింగ్‌లో ఉంచితే కఠిన చర్యలు: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్.**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (భారత శక్తి): ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, విన్నపాలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించకూడదని, వాటిని నిర్దేశిత గడువులోగా సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. 28 ఫిర్యాదుల నమోదు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పౌరులు తరలివచ్చారు. మొత్తం 28 ఫిర్యాదులు అందగా, వాటిలో ఎక్కువగా పౌర సదుపాయాలు, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యానికి సంబంధించినవి ఉన్నాయి. కమిషనర్ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత విభాగాల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడారు. ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

**విభాగాల వారీగా సమీక్ష :**

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. "ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా విభాగాల అధికారులు తమ వద్దకు చేరిన దరఖాస్తులపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించి నివేదిక సమర్పించాలి" అని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు అదనపు కమిషనర్లు సత్యనారాయణ, మంగతాయారుతో పాటు విజిలెన్స్ ఏఎస్పీ నరసింహ రెడ్డి, నిర్వహణ విభాగం చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, సీసీపీ శ్రీనివాస్, జాయింట్ కమిషనర్లు జయంత్, రజనీకాంత్ తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో కొలువుదీరిన నూతన పాలకవర్గం

* **నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ గా బాదం రమేష్,**





నాగర్ కర్నూల్ జిల్లా , ఫిబ్రవరి 16 (భారత శక్తి): నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన 24 మంది సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించిన ప్రత్యేక అధికారి, నాగర్ కర్నూల్ ఆర్డీఓ సురేష్ బాబు. ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎన్నికైన 24 మంది నూతన సభ్యులను జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో పరోక్ష విధానం ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కొరకు సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు అందరికి ప్రత్యేక అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్లు ముందుగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల, అనంతరం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం 12.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసింది. 24 మంది సభ్యులున్న నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు, సమావేశానికి 18 మంది కాంగ్రెస్ సభ్యులు, 6 మంది బిఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. 100 % కోరం సభ్యుల ప్రతిపాదన మేరకు అధికారులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పురపాలిక చైర్ పర్సన్‌గా 23వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తీగల సునేంద్ర పేరును 4వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు చింతలపల్లి వసంత ప్రతిపాదించగా 21వ వార్డు కౌన్సిలర్ పొగిడే శంకర్ బలపరిచారు. మరో అభ్యర్థి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో తీగల సునేంద్ర ను చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రత్యేక అధికారి ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ గా 8వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బాదం రమేష్ పేరును 11వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు ఆసిఫా బేగం ప్రతిపాదించగా, 6వ వార్డు కౌన్సిలర్ మక్కలపల్లి శ్రీనివాసులు బలపరిచారు. మరో పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో వైస్ చైర్మన్ గా బాదం రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ప్రత్యేక అధికారి చైర్మన్, వైస్ చైర్మన్ లను ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మునిసిపల్ కమీషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తాబితారాణీ, ఎంపీడీవో చేన్నమ్మ, ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎన్నికైన కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి మున్సిపాలిటీ లో కొలువుదీరిన నూతన పాలకవర్గం

* **వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాధవి మిడిదొడ్డి, వైస్ చైర్ పర్సన్ గా గురకొండ మధుసూదన్ గౌడ్**

వనపర్తి జిల్లా , ఫిబ్రవరి 16 (భారత శక్తి): వనపర్తి మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన 33 మంది సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించిన ప్రత్యేక అధికారి, ఆర్డీఓ సుబ్రమణ్యం. ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎన్నికైన 33 మంది సభ్యులను జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు వనపర్తి మున్సిపాలిటీలో పరోక్ష విధానం ద్వారా చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక కొరకు సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు అందరికి ప్రత్యేక అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం 12.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసింది. 33 మంది సభ్యులున్న వనపర్తి మున్సిపాలిటీ లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు చట్ట ప్రకారం 17 మంది సభ్యుల కోరం అవసరం ఉండగా, సమావేశానికి 22 మంది(20 మంది కాంగ్రెస్+ ఇద్దరు స్వతంత్రులు) సభ్యులు హాజరయ్యారు. కోరం సభ్యుల ప్రతిపాదన మేరకు అధికారులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వనపర్తి పురపాలిక చైర్ పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి మాధవి మిడి దొడ్డి పేరును 13వ వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశురాం ప్రతిపాదించగా 4వ వార్డు కౌన్సిలర్ గంధం శరవంద బలపరిచారు. మరో అభ్యర్థి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో మాధవి మిడిదొడ్డి ను చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రత్యేక అధికారి ప్రకటించారు. అనంతరం వైస్ చైర్ పర్సన్ గా గురకొండ మధుసూదన్ గౌడ్ పేరును 5వ వార్డు కౌన్సిలర్ బాపన్ పల్లి వెంకటేశ్వర్లు ప్రతిపాదించగా, 31వ వార్డు కౌన్సిలర్ బి. విజయలక్ష్మి బలపరిచారు. మరో పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో వైస్ చైర్ పర్సన్ గా గురుకొండ మధుసూదన్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ప్రత్యేక అధికారి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎన్నికైన కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మిడిదొడ్డి మాధవి
చైర్మన్



గురకొండ మధుసూదన్
గౌడ్ వైస్ చైర్మన్



## బాలాపూర్‌లో భక్తి ప్రపత్తులతో 'శివ కల్యాణం'

* **కనులపండువగా కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహణ**
* **ఆలయ పూజారికి ఘన సన్మానం.. పాల్గొన్న చిగిరింత నరసింహారెడ్డి.**

బాలాపూర్, ఫిబ్రవరి 16 (భారత శక్తి) : ఆధ్యాత్మిక పరిమళాలు.. వేద మంత్రోచ్చారణల మధ్య బాలాపూర్ డివిజన్ పరిధిలోని శివజీ మహారాజ్ దేవాలయం భక్తజన సంద్రమైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనులపండువగా సాగింది. సోమవారం ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో దిగ్విజయంగా పూర్తయింది.

**భక్తిశ్రద్ధలతో పూజలు:**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్న ఆయన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి, ఆధ్యాత్మిక సేవలో తరించారు. ఆలయంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రధాన పూజారి దుర్గ ప్రసాద్‌ను చిగిరింత నరసింహారెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

**పాల్గొన్న ముఖ్య నేతలు:**

ఈ ఆధ్యాత్మిక వేడుకలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, నాయకులు బాలింగని జంగయ్య, టేకుల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో ఆలయ కమిటీ చైర్మన్ టేకుల శశిధర్ రెడ్డి, డైరెక్టర్లు ఇక్కే శ్రీను, కళ్ళెం శ్రీధర్ రెడ్డి, పగడాల ఉమేష్, కోలన్ శ్రీనివాస్ రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

## భవన కాపలాదారుడు అనుమానాస్పద మృతి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 16 (భారత శక్తి): గత ఏడాది క్రితమే ఆర్థిక లావాదేవిలలో గొడవ వచ్చి ఒక మొబైల్ షాప్ యజమాని చావుకు కారణమై జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు వచ్చిన భవన యజమానికి చెందిన చైతన్యపురిలో గల రాజలింగం కాంప్లెక్స్ భవన సముదాయానికి వాచ్ మెన్ గా పని చేస్తున్న వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన ఘటనపై కుటుంబసభ్యులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఆత్మహత్యా? లేక హత్యా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన చామల ముత్తయ్య (47) అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన చైతన్యపురి పోలీసు స్టేషన్ పరిధిలో స్థానికంగా చర్చనీయాంశమైంది. మృతుడి భార్య 20 సంవత్సరాల క్రితమే మరణించగా, ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇప్పటికే వివాహం జరిపించారు. కుటుంబ బాధ్యతలను నెరవేర్చుకుంటూ జీవనం సాగిస్తున్న ముత్తయ్య ముక్కుసూటి తత్వం కలిగిన వ్యక్తి అని కుటుంబసభ్యులు చెబుతున్నారు. అయితే ఈ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉరి వేసుకుని చనిపోయిన వ్యక్తి పాదాలు నేలను ఆనుకుని ఉండటం అనుమానాస్పదంగా ఉందని పేర్కొంటున్నారు. ఎవరో ముందుగా హత్య చేసి, తరువాత ఉరి వేసుకుని చనిపోయాడని, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు చామల ముత్తయ్య కుమారుడు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, కుటుంబసభ్యులు గొడవ చేస్తున్న సందర్భంగా ఉద్రిక్త వాతావరణంలో పోలీసులు సమయస్ఫూర్తిగా ప్రవర్తించి ముత్తయ్య మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు. పోస్ట్‌మార్టం నివేదిక వెలువడిన తరువాతే అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశముంది. ముత్తయ్య మృతి వెనుక నిజం ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయంగా మారింది. పోలీసుల దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.